Whatsapp No: 9440662699

సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక

RNI No. APTEL 2015/ 66622

# రాజధాని వార్తలు

www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv

అమరావతి సంపుటి : 2 సంచిక 31, పేజీలు 8 రూ. 2/-

ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక

సోమవారం 24- ఆదివారం 30, ఏప్రిల్ 2017



కాంతిలాల్ దండే స్థానంలో గుంటూరు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కొన శశిధర్



కృష్ణాజిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బాలయ్యనాయుడు లక్ష్మీకాంతం



శాసన మండలి సభాపక్ష నేతగా ఎన్నికైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

## నేడు ఢిల్లీ వెళ్లనున్న సీఎం చంద్రబాబు



**రావా ప్రతినిధి, అమరావతి:** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రేపు ఉదయం ఢిల్లీకి వెళ్లనున్నారు. రేపు జరగనున్న నీతి ఆయోగ్ సమావేశంలో ఆయన పాల్గొంటారు. నీతి ఆయోగ్ సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై ఇవాళ ఉన్నతాధికారులతో చంద్రబాబు భేటీ అయ్యారు. షెడ్యూల్ 9, 10లోని ఉమ్మడి సంస్థల ఆస్తుల విభజనపై, కేంద్రం ఉత్తర్వులపై ప్రధాని, హోంమంత్రితో సీఎం చర్చించనున్నారు. ఉన్నత విద్యామండలి కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది.



## ప్రభుత్వ భవనాలకు

# ఎన్ఓసీలు లేవ్..

**రా.వా. ప్రతినిధి,అమరావతి :** ఆంధ్రప్రదేశ్ తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ భవనాలకు అగ్నిమాపక శాఖ నుంచి ధ్రువీకరణ పత్రాలు ఇప్పటి వరకు తీసుకోలేదని ఒక అధికారి తెలిపారు. ముఖ్యమంత్రి నివాసం కూడా అగ్నిమాపక శాఖ నుండి ఎన్ఓసీ లేదన్నారు. ప్రోటోకాల్ ప్రకారం మంగళగిరి నుండి అగ్నిమాపక యంత్రాన్ని ఫైర్ పోలీసులను ముఖ్యమంత్రి నివాసానికి తరచుగా పంపి జాగ్రత్తలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. తాత్కాలిక సచివాలయంలోని 5 భవనాలు, అసెంబ్లీ ఏసీలతో ఉన్నాయని, వాటిలో కంప్యూటర్లు, ఇన్వర్టర్లు, యూపీఎస్‌లు ఉన్నాయన్నారు. వందల మంది ఉద్యోగాలు పనిచేస్తుండే ఈ ప్రభుత్వ భవనాలలో ఏదైన ప్రమాదం జరిగితే అదుపు చేయటం కష్టమైన పనని ఆయన అన్నారు. అగ్నిమాపక శాఖ నుంచి అధికారులు ప్రభుత్వ భవనాలు, శాసనసభ, శాసన మండలి పరిశీలించి అగ్నిమాపక ధ్రువీకరణ పత్రాలు ఇస్తారని అధికారులు చెప్తున్నారు. అత్యాధునికంగా నిర్మించిన తాత్కాలిక ప్రభుత్వ భవనాలు, 231 మంది ఉండే శాసనసభ, 90 మంది కూర్చొనే విధంగా ఉండే శాసనమండలి, ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం జరిగిన విషయం తెలిసిందే.. వీటన్నిటికీ అగ్నిమాపకశాఖ నుంచి ధృవపత్రాలు తీసుకునేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



## కర్ణాటకలో బాహుబలికి పచ్చజెండా

ప్రముఖ నటుడు సత్యరాజ్ (కట్టప్ప) క్షమాపణలు చెప్పడంతో కర్ణాటకలో బాహుబలి రిలీజ్‌కు అడ్డంకులు తొలగాయి.
ఈ నెల 28న అన్ని రాష్ట్రాల్లో బాహుబలి మీ ముందుకు వస్తున్నాడు

## ముస్లింలకు గుర్తింపు రాజ్యాంగమే ఇచ్చింది : ఒవైసీ



**హైదరాబాద్:** ముస్లింలకు గుర్తింపు ఇచ్చింది రాజ్యాంగమే కానీ, రవిశంకర్ ప్రసాద్ కాదని ఒవైసీ తెగేసిచెప్పారు. ముస్లింలు తమకు ఓటు వేయకపోయినా కేంద్రం వారికి తగిన గౌరవం ఇచ్చిందంటూ కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ చేసిన వ్యాఖ్యలపై ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కేంద్ర మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. రాజ్యాంగమే అందరికీ సుప్రీం అని, రాజ్యాంగం ముస్లింలకు హక్కులు ప్రసాదించిందనీ, వారి హక్కుల పరిరక్షణ బాధ్యత రాజ్యాంగానిదేనని ఆయన స్పష్టం చేశారు. ఇండియా వంటి ప్రజాస్వామిక దేశంలో నేతలను ఎన్నుకునే స్వేచ్ఛతమకు ఉందని, రాజ్యంగమే సుప్రీం అనే విషయం రవిశంకర్ ప్రసాద్ గ్రహించడం మంచిదని ఒవైసీ హితవు పలికారు.

జీవిత మకరందం చవిచూద్దాం... 8 లో



# రాజధాని వార్తలు కలం

## వారసత్వాల భారతం

భారతదేశంలో పూర్వకాలం వివిధ రకాల విద్యలన్నీ అనువంశికంగా వస్తుండేవి. అంతేకాదు రాజ్యాలు కూడా రాజుల నుంచి వారి మొదటి సంతానానికి వెళుతుండేవి. అవి రాజరిక రోజులు కాబట్టి సరిపోయింది. అయితే ప్రస్తుతం కొనసాగిస్తోంది ప్రజాస్వామ్యం అయినా జరిగేది మాత్రం వారసత్వ రాజకీయాలే..

ఒక్క రాజకీయాల్లోనే కాదు.. సినిమాల్లోనూ, వ్యాపారాల్లోనూ, ఇదే తంతు జరుగుతోంది. బయటి వ్యక్తులు కొత్తగా వచ్చి నిజాయితీతో చేయడానికి ఇక్కడ ఏమాత్రం అవకాశం లేకుండా పోతోంది. తాత, తండ్రి, మనవడు అందరూ ఒకే కుంటుబం నుంచి వచ్చినవారే కాకుండా వారే హీరోలు..వారి ముఖం బాగోపోయినా, వాచకం కుదరకపోయినా, నటన రాకపోయినా ఒకటికి పది సినిమాలకు పెట్టుబడిపెట్టి వారిని ఆదరించేవరకు ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెడుతున్నారు. అలాగే కుటుంబ వ్యాపారాలు, వృత్తులు కూడా.. ఒక వ్యక్తి డాక్టరయితే.. వారి కుటుంబాలన్నీ డాక్టర్లుగానే ఉంటారు. ఒకవేళ ఎంసెట్‌లో (ప్రస్తుతం నీట్ అయ్యింది) ర్యాంకు రాకపోతే మెడిసిన్ సీటు కొనైనా వారు తమ పిల్లలను చదివించుకుంటారు గాని, వారసత్వాన్ని మాత్రం ఒదులుకుంటానికి ఇష్టపడరు. మనదేశంలోనే ఇలా జరుగుతుందికాని, బయటి దేశాల్లో వ్యక్తి అభిరుచి మేరకు లేదా చదివిన దాన్ని బట్టి వ్యక్తులు తమ వృత్తులను ఎంపిక చేసుకుంటారు.

స్వాతంత్ర్యం అనంతరం అప్పటివరకు ఉద్యమాల నడిపిన కాంగ్రెస్‌ను రద్దు చేయమని మహాత్మాగాంధీ కోరారు. అయితే అందుకు ఒప్పుకోని ఆనాటి నాయకులు మరీ ముఖ్యంగా జవహర్‌లాల్ నెహ్రూ కాంగ్రెస్ చేసిన త్యాగాలను ఏకరువుపెట్టి ఎన్నికల్లో గెలిచారు. ఆపై అది ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల వారసత్వంలో కొనసాగి, సోనియాగాంధీ చేతిలో ఆ పార్టీ అంపశయ్య మీదకు చేరింది. ప్రస్తుతం ఆరోగ్య కారణాలతో సోనియాగాంధీ విశ్రాంతిలో ఉండగా, వారసుడు రాహుల్‌గాంధీ తగిన శక్తియుక్తులు లేక పార్టీని బలోపేతం చేయలేకపోతున్నారు. కాంగ్రెస్ పార్టీ అంపశయ్యపై ఉంది. అంతేకాని కుటుంబంకాని వ్యక్తులను, సీనియర్లను ఉపయోగించి పార్టీని అధికారంలోకి తెచ్చే ప్రయత్నాలు మాత్రం జరగడంలేదు. అయితే ప్రియాంకవాద్రా, లేదంటే రాహుల్‌గాంధీ అనుకుంటూ వారి చుట్టూనే రాజకీయాలు తిరుగుతున్నాయి.

ఇక రాష్ట్రం విషయానికి వస్తే కీ.శే వైఎస్ రాజశేఖరరెడ్డికి ప్రజల్లో ఉన్న ఫాలోయింగ్‌ను ఒడిసిపట్టడానికి ఆయన కుమారుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వైఎస్ కాంగ్రెస్ పేరుతో పార్టీని స్థాపించి, అదే దిశలో కొనసాగుతున్నారు. ఇంకో విషయం ఏమంటే మా అబ్బాయి వ్యాపారాలు చేసుకుంటాడు.. నాకు ఆదర్శం 20 ఏళ్లపాటు పశ్చిమ బెంగాల్‌కు ముఖ్యమంత్రిగా చేసిన జ్యోతిబసు, వారి కుటుంబం నుంచి కూడా ఎవ్వరూ రాజకీయాల్లోకి రాలేదని పేర్కొన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన కుమారుడు లోకేష్‌ను ప్రత్యక్ష రాజకీయాల్లోకి తేవడమే కాకుండా మంత్రిపదవిని కూడా కట్టబెట్టేశారు. నిజానికి అంత పెద్ద స్థాయిలో ఉన్నవారు బాగా చదువుకొని బాగా స్థిరపడే అవకాశాలుంటాయి. ఇంకా చెప్పాలంటే మంచి మంచి వ్యాపారాలు చేసుకోవచ్చు.స్పోర్ట్స్‌లో మంచి స్థాయికి వెళ్లవచ్చు. అంతేకాని కుటుంబవారసత్వ రాజకీయాలకే వారంతా ప్రాధాన్యత ఇవ్వడం దురదృష్టం. దీంతో రాజకీయాల్లో నూతన ఒరవడిని తీసుకురావడానికి ఛాన్సులేకుండా పోతోంది. చదువుకున్నవారు, సామాజిక బాధ్యత కలిగినవారు రాజకీయాల్లో మనగలగలేక పోతున్నారు. దేశంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ, కీ.శే. తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌లు మాత్రమే తమ వారసులను రాజకీయాల్లోకి తీసుకురాలేదు.

ఈ దేశంలో ఒకే ఒక్కరు మాత్రం తమ కష్టాలు తమ పిల్లలు పడకూడదని, తమ వారసత్వం వారికి ఉండకూడాదని, మనసావాచా కోరుకుంటున్న వారెవరంటే అన్నదాత మాత్రమే..

## పౌరులు-చట్టాలు

### Law-Citizen



కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
హైకోర్టు న్యాయవాది
98495 68901/83309 68901
katuruRavindraTrivikram@gmail.com



9 ప్రజల హక్కుల రక్షణ నిమిత్తం వీలయినన్ని సంస్థల్ని ప్రభుత్వ అధీనంలోకి తీసుకువచ్చే ప్రయత్నం శుభపరిణామం.

న్యాయవ్యవస్థను ప్రభుత్వం సంస్థగా పరిగణించవచ్చా?రాజ్యాంగ అధికరణం-12లో న్యాయవ్యవస్థను ప్రభుత్వంలో భాగంగా చెప్పలేదు. ఇది ఇతర అధికార సంస్థల నిర్వచనంలోకి వస్తుంది. కోర్టులు చట్టంద్వారా ఏర్పడతాయి. తమ అధికారాలను చట్టం ద్వారానే పొందుతాయి. కోర్టులు తమ అధికారవినియోగం చట్టపరిధిలో 142,145 అధికారణ క్రింద నిబంధనలను రూపొందిస్తున్నప్పుడు ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నప్పుడు అవి ప్రభుత్వ యోగ్యతతో చేసినట్లుగా భావించటం జరుగుతుంది. వాటిని అధికార అతిక్రమణలుగా పరిగణించి, అధికరణలు 32, 226ల క్రింద నివారణలు పొందవచ్చు. అలాగే ప్రధాన న్యాయమూర్తి, న్యాయ అధికారాల నియామకాల్లోని నిర్ణయాలు న్యాయాదేశాలకు లోబడి ఉటాయి. రాజ్యాంగంలోని సమానత్వహక్కులకు విరుద్దంగా నియామకాలు చేస్తే 'రిట్'కి అవకాశం ఉంటుంది.

అయితే, తగిన అధికారం గల హైకోర్టుమీద 'రిట్' జారీ చేయకూడదు. రాజ్యాంగలో లభించిన ప్రాథమిక హక్కులకు న్యాయ ఆదేశాలను విరుద్ధంగా భావించే అవకాశంలేదు.

**13వ అధికరణ : ప్రాథమిక హక్కులకు విరుద్ధమైన చట్టాలు :** అధికరణాలు-13,32,226లు ప్రాథమిక హక్కుల న్యాయబద్ధతకు సంబంధించినది. ఏదైనా చట్టం ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉంటే, దానిని రద్దు చేసే అధికారం ఈ అధికరణల ద్వారా లభిస్తుంది.

372వ అధికరణం, రాజ్యాంగ అమలకు ముందుగల చట్టాలు చట్టసభల్లో సవరణలు లేదా కొత్తచట్టంగా ఏర్పడేవరకు చెల్లుబాటు అవుతాయని చెబుతోంది. అంటే వాటి జీవనకాలాన్ని లేక వినియోగానికి ఊతాన్ని 372వ అధికరణం కల్పిస్తోంది.

అలాంటి అవకాశం లేకపోతే గతంలోని చట్టాలన్నిటినీ మళ్లీ చట్ట సభల్లో చేయాల్సి వచ్చేది. దీనివల్ల అనవసర శ్రమ, కాలయాపన జరిగేది. అధికరణం 13(1) రాజ్యాంగం అమలులోకి రాకమునుపుగల చట్టాలకు సంబంధించింది. గతచట్టాల్లో ఏదైనా ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేట్టుగా ఉంటే, ఆమెరకు రద్దవుతుంది. ఇది రాజ్యాంగం అమలులోకి వచ్చిన తేదీని పరిగణలోకి తీసుకొని చేయవలసిన చర్య, అయితే, దీనిని రద్దు చేయగల అధికారం కోర్టు మాత్రమే అలాచేయగలదు.

నిబంధనలు : అధికరణం 13(1) ని కొన్ని నియమనిబంధనలకులోబడి వినియోగించాల్సి ఉంటుంది. అవేమిటంటే

గతం నుండి వర్తించవు : (no retrospectvie effect) రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు రాజ్యాంగం అమలుతేదీ ముందు నుండి వర్తించవు. అయితే, 1951లోని ఒక కేసులో సుప్రీంకోర్టు దీనిమీద మరింత స్పష్టతనిచ్చింది. "రాజ్యాంగం అమలులోకి రాకమునుపు జరిగిన చర్య అప్పటి చట్టాలకు అనుకూలంగా ఉంటే, అది ప్రశ్నించదగింది కాదు. రాజ్యాంగం అమలులోకి రాక మునుపు జరిగిన చర్య అప్పటి చట్టాలకు అనుకూలంగా ఉంటే, అది ప్రశ్నించదగిందకాదు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత, అది విరుద్ధంగా ఉన్నాసరే..!!

దీనివల్ల పాతకేసుల తీర్పులను తిరగదోడాల్సిన దుస్థితి తప్పింది.

తొలగింపునిబంధన : (rule of severaebility) రాజ్యాంగం అమలులోకి రాకమునుపు ఉన్న మొత్తం చట్టాన్ని రద్దు చేయాల్సిలేదు. కేవలం ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉ్నంతవరకే తొలగించాల్సి ఉంటుంది. అయితే గత చట్టాలల్లో అనుకూల విరుద్ధ అంశాలు గాఢంగా పెనువేసుకొని విడుదల అవ్వడానికి వీలు కానప్పుడు మొత్తం చట్టాల్నే రద్దు చేయాల్సి ఉంటుంది. కారణం, చెల్లు చాటయే అంశం ఒక్కటిగా మనలేదు.

గ్రహణసిద్ధాంతము :(doctrine of eclipse) ప్రస్తుతం అమలులో ఉన్న చట్టం, ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా ఉండి, రాజ్యాంగ అమలు తేదీ నుండి చెల్లుబాటు కానప్పటికీ, అది పూర్తిగా నిర్వీంర్యమైనట్టు కాదు. ప్రాథమిక హక్కులు వర్తించని వారికి ఆ చట్టం వర్తిస్తుంది. ఒకవేళ చట్టంచెల్లుబాటు కావాలంటే, రాజ్యాంగసవరణ ద్వారా ప్రథమిక హక్కుతొలగించ వచ్చు-ఉదా॥ ఆస్తి హక్కు తొలగింపు.

పౌరులకు ఇవ్వబడిన రాజ్యాంగ ప్రాథమిక హక్కులు సద్వినియోగం కానంతవరకు అవి వరాలే! దుర్వినియోగ పరిస్తే వ్యక్తికీ దేశానికి చేటు వాటిల్లుతుంది.

వెలుగు-నీడల్లాగా హక్కులు-బాధ్యతలు కలిసే ఉంటాయి.

## 354మందికి ఉచిత వైద్య పరీక్షలు

**రా.వా.ప్రతినిధి, నాగుల్‌మీరా (తుళ్లూరు) :** తుళ్లూరుమండలకేంద్రమైన కాకుమమాను వెంకటేశ్వరావు జిల్లాపరిషత్‌హైస్కూల్ ఆవరణలో సీఆర్‌డీఏ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈమేరకు మణిపాల్ హాస్పటల్ కాటూరి హాస్పటల్ .శంకర్ కంటిఆసుపత్రి. ఆంధ్రుహాస్పటల్.వీజేఆర్ డయాబెటిక్‌సెంటర్ మంగళగిరి.దాహుతీ డెంటల్‌కేర్ కు సంబంధించిన వైద్యులు శిబిరంలో పాల్గోన్నారు. 354మంది రోగులకువైద్యసేవలుఅందించారు. సుమారు 300మందికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు సీఆర్‌డీఏ సిబ్బంది తెలిపారు.



వైద్య శిబిరంలో మందుల పంపిణి

విజయవాడ ప్రకాశం బ్యారేజిపై మరమ్మతులు చేపడుతున్న దృశ్యం..



# 'ఐలా' ఎన్నికల్లో సుంకర ప్యానల్ విజయం

**ఐదు ఆఫీస్ బేరర్లు, 11 వార్డు సభ్యులు కైవశం**

**చైర్మన్‌గా సుంకర దుర్గాప్రసాద్**

**వైస్ చైర్మన్‌గా పంచుమర్తి ప్రసాద్**

**రా.వా.ప్రతినిధి , ఎం బేగ్, విజయవాడ) :** జవహర్ ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఏరియా అభివృద్ధికి సంబంధించి 'ఐలా' (ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ) ఎన్నికలు ఆటోనగర్ బస్టాండ్ సమీపంలోని ఐలా కార్యాలయంలో ప్రతిష్టాత్మకంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో సుంకర దుర్గాప్రసాద్, ఎండీ సాదిక్ ప్యానెల్స్ పోటీ పడగా, సుంకర దుర్గా ప్రసాద్ ప్యానల్ ఘన విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి వెంకట్రావు ప్రకటించారు. చైర్మన్‌గా సుంకర దుర్గాప్రసాద్, వైస్ చైర్మన్‌గా పంచుమర్తి ప్రసాదరావు, కార్యదర్శిగా అన్నే శివనాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా మాహబూబ్‌ఖాన్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా బాయన బాబూజీ ఇంతకు ముందే దుర్గాప్రసాద్ ప్యానాల్ నుండి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో సుంకర దుర్గాప్రసాద్ ప్యానల్ ఈ ఎన్నికల్లో మొత్తం స్వీప్ చేసింది. 8, 9 వార్డు మెంబర్లు మాత్రమే సాదిక్ ప్యానల్ నుండి గెలుపొందారు. ఇంతకుముందు కూడా సుంకర దుర్గప్రసాద్ ప్యానలే అధికారంలో ఉంది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుండి ఇరువర్గాల మధ్య అనేక సందర్భాల్లో గొడవలు జరుగుతుండడంతో పోలీసులు పెద్ద షంఖ్యలో మోహరించారు. దాదాపు పోలీసుల కనుసన్నలోనే ఈ ఎన్నికలు జరిగాయని చెప్పవచ్చు. ఐదు ఆఫీస్ బేరర్లు , 13 మేనేజింగ్ కమిటీ సభ్యులకు (వార్డులకు) ఎన్నికలు జరగాల్సి వుండగా, సుంకర దుర్గాప్రసాద్ , ఎండీ సాదిక్ ప్యానెల్స్ పోటీ పడ్డాయి.



13 వార్డు సభ్యుల్లో దుర్గాప్రసాద్ ప్యానల్‌కు చెందిన ఏడు వార్డుల సభ్యులు ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక 4,5,8,9,10,13 వార్డులతోపాటు నాలుగు ఆఫీస్ బేరర్ల పోస్టులకు మాత్రమే ఎన్నికలు జరిగాయి. వీటిల్లో 8,9 వార్డులు సాదిక్ ప్యానల్ గెలుచుకోగా, 4,5,10,13 వార్డులను దుర్గాప్రసాద్ ప్యానల్ గెలుచుకుంది. మొత్తం 13వార్డుల్లో 11 వార్డులను దుర్గాప్రసాద్ ప్యానల్ గెలుచుకోగా, రెండు వార్డుల మాత్రమే సాదిక్ ప్యానల్ గెలుచుకుంది. ఆస్తిపన్ను చెల్లింపు దారులైన 1,366 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాల్సి వుండగా , 974 ఓట్లు మాత్రమే పోలయ్యాయి.

# విజయవాడలో కరోన కంపెనీ బస్సులు ప్రారంభం

**రా.వా.ప్రతినిధి- కరిముల్లా, అమరావతి :** అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ప్రత్యేకతలు కలిగిన కరోన కంపెనీకి చెందిన ఏసీ బస్సులు రాజధాని రోడపై పరుగులు తీశాయి. దేశంలోని మొదటిగా విజయవాడలోనే మొత్తం 15 బస్సులను ఆర్టీసీ సంస్థ ప్రవేశపెట్టి ప్రారంభించింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, ఆర్టీసీ ఎండీ ఎం.మాలకొండయ్య ఏసీ బస్సులను ప్రారంభించారు. మంత్రి స్వయంగా ఆ బస్సును డ్రైవింగ్ చేస్తూ నగర రోడ్లపై హల్‌చల్ చేశారు. మొత్తం 100 ఏసీ బస్సులను కొనుగోలు చేసేందుకు ఆర్టీసీ యాజమాన్యం ఆర్డర్ పెట్టగా మొదటిగా 15 బస్సులను కరోన కంపెనీ డెలివరీ చేసింది. ఆయా బస్సులను విజయవాడ నుంచి హైదరాబాద్‌కు 9, బెంగళూరుకు 4, చెనైకు 2 బస్సుల వంతున ఆయా



రూటల్లో నడుపుతామని అధికారులు వెల్లడించారు.

**కరోన కంపెనీ బస్సుల ప్రత్యేకతలు..**

- 245 హార్స్ పవర్‌గల కమిన్స్ వెనుగ భాగం ఇంజిన్
- 32 కిలోవాట్ల శక్తివంతమైన ఎయిర్ కండీషనింగ్ వ్యవస్థ
- బస్సు ముందు భాగంలో పూర్తి స్వతంత్ర ఎయిర్ సస్పెన్షన్
- హైడ్రాలిక్ రిటార్డర్‌తో కూడిన ఏబీఎస్ బ్రేక్‌వ్యవస్థ
- మోనోకాక్ బాడీ నిర్మాణం
- హరిత మాగ్నమ్ సీట్లు
- పూర్తిమెట్ల మార్గంతో అత్యవసర ద్వారం

ఈ ప్రత్యేకతలు కలిగిన ఏసీ బస్సులను ఆర్టీసీ ఒక్కోటీ రూ.66 లక్షలు కేటాయించి కొనుగోలు చేసింది. ఈ బస్సులో ఉన్న 41 సీట్లుకు గరుడ బస్సుల మాదిరిగానే కిలో మీటర్‌కు బేసిక్ చార్జీ రూ.1.71 మాదిరిగానే అధికారులు నిర్ణయించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఏవీ రావు, జి.జచరావ్, ఎ.కోటేశ్వరరావు, ఆర్.శశిధర్, విజయవాడ జోన్ ఈడీ ఎన్.వెంకటేశ్వరరావు, ఆర్ఎం రామారావు, యూనియన్ నేతలు తదితరులు పాల్గొన్నారు.



**విజయవాడ ప్రకాశం బ్యారేజీ దిగువన లోటస్ హోటల్‌వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులు**

## వైకాపా సోషల్ మీడియాకు నోటీసులు

**హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సామాజిక మాధ్యమ విభాగానికి తుళ్లూరు పోలీసులు నోటీసులు జారీచేశారు. ఈ నెల 25న విచారణకు హాజరు కావాలంటూ సోషల్ మీడియా విభాగాధిపతి మధుసూదన్‌రెడ్డికి నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్‌మీడియా అసభ్య పోస్టులు పెడుతున్నారంటూ రవికిరణ్ అనే వ్యక్తిని రెండు రోజుల క్రితం పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. సోషల్‌మీడియాలో పొలిటికల్ పంచ్ పేరుతో రవికిరణ్ పోస్టులు పెడుతున్నాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం విడిచిపెట్టారు. అయితే రవికిరణ్‌కు వైకాపాతో సంబంధాలున్నాయని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ సోషల్ మీడియా విభాగానికి నోటీసులు జారీ చేశారు.

# జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామి చేస్తా

**కలెక్టర్ లక్ష్మీకాంతం**

**రా.వా.ప్రతినిధి , వి. నాగేశ్వరరావు, మచిలీపట్నంటౌన్ :** అందరి సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా చేస్తానని కలెక్టర్ బాలయ్యనాయుడు లక్ష్మీకాంతం అన్నారు. కలెక్టరేట్‌లో కృష్ణాజిల్లా కలెక్టర్గఆ ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఇల్లు, రక్షింత మంచినీరు, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు అవసరమని ఈరంగాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని అన్నారు. నీటి సంరక్షణ ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైందని, రాబోయే 90 రోజులలో నీరు -చెట్టు, నీరు-ప్రగతి అంశాలపై దృష్టి సారిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3.42లక్షల పంటకుంటలు ఏర్పాటయ్యాయని, జిల్లాలో 5 ఎకరాల లోపు రైతులందరూ పంటకుంటలు ఏర్పాటు చేసుకునే



విధంగా చర్యలు చేపడతామన్నారు. జిల్లాలో ప్రస్తుతం మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల విస్తరణ పనులు, విమానాశ్రయం విస్తరణ తదితర అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తామన్నారు. ముఖ్యంగా మచిలీపట్నం అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ కార్యకలాపాలపై దృష్టి పెట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకూ 482 గ్రామ పంచాయతీలు ఓడీఎఫ్‌గా ప్రకటించారని, దీనిపై దృష్టి సారించి నూరుశాతం బహిరంగ మలవిసర్జన రహిత జిల్లాగా కృషి చేస్తామన్నారు. తొలుత కలెక్టర్ నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జాయింట్ కలెక్టర్ గంథం చంద్రుడు, ఎస్పీ విజయకుమార్, విజయవాడ కనకదుర్గ దేవస్థానం ఈవో సూర్యకుమారి, ముడ వీసీ వేణుగోపాలరెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ శేషుకుమార్, బందరు ఆర్డీఓ పి.సాయిబాబు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది కలెక్టర్‌ను కలసి పుష్పగుచ్ఛాలిచ్చి అభినందనలు తెలియజేశారు.

## నేటి నుంచి ముస్లిం పర్సనల్‌లా జాగృతి ఉద్యమం



**రా.వా.ప్రతినిధి, వి.నాగేశ్వరరావు , మచిలీపట్నం :** స్థానిక కోనేరుసెంటర్‌లోని మిన్నార్ మస్జీద్‌లో జమాఅతె ఇస్లామీ హింద్ మచిలీపట్నంశాఖ ఆధ్వర్యంలో ముస్లిం పర్సనల్ లా జాగృతి ఉద్యమం ఈ నెల 23 నుండి మే 7వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు సెక్రటరీ మహ్మద్ ఫిరోజ్ తెలిపారు. ముస్లిం పర్సనల్ లా జాగృతి ఉద్యమం విషయమై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ తలాక్ విషయమై వస్తున్న వదంతులు నిజాలు కావని తలాక్ చెప్పే విషయంలో మూడు నెలల వ్యవధి ఉంటుందని అనంతరం భార్యా భర్తలు వారి అభిప్రాయం వరకే విడిపోతారని అన్నారు. దీనిపై ముస్లింలాలో కూడా నిక్షిప్తమైన అర్థంతో లోబడి ఉంటుందే తప్ప ఎవరినీ కించపరిచే విధంగా ఉండదని ఆయన అన్నారు. మే 7 వ తేదీన విజయవాడలోని యనమలకుదురు లాకుల వద్ద బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎండి సాయాముతుల్లా, ఎం.షరీఫ్, ఎండి,షేక్ మస్తాన్ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

## రిలయన్స్‌కు పంచ్ : మళ్లీ టాప్స్‌లోకి టీసీఎస్

**న్యూఢిల్లీ :** రికార్డు సృష్టించిన రిలయన్స్ జియోను టెక్ దిగ్గజం టీసీఎస్ వెనక్కి నెట్టేసింది. మళ్లీ తన స్థానాన్ని తాను ఆక్రమించుకుంది. దేశంలో అత్యంత విలువైన కంపెనీల జాబితాలో టీసీఎస్ మళ్లీ అగ్రస్థానంలో నిలిచింది. ఇటీవలే టీసీఎస్ స్థానాన్ని రిలయన్స్ అధిగమించి టాప్స్‌లో నిలిచింది. అయితే ప్రస్తుతం రిలయన్స్‌ను టీసీఎస్ అధిగమించినట్టు వెల్లడైంది. ముగిసిన ట్రేడింగ్స్‌తో టాటా గ్రూప్స్‌కు చెందిన ఈ టెక్ సంస్థ మార్కెట్ విలువ రూ.4,55,405.31 కోట్లగా నమోదైంది. ఇది రిలయన్స్ మార్కెట్ విలువ కంటే 299.98 కోట్లు అధికం.

ప్రస్తుతం రిలయన్స్ ఇండస్ట్రీస్ విలువ 4,55,105.33 కోట్లగా ఉంది. నాలుగు ఏళ్ల క్రితమే అత్యంత విలువైన కంపెనీల జాబితాలో అగ్రస్థానంలో ఉన్న రిలయన్స్ ఇండ్రస్టీస్ స్థానాన్ని టీసీఎస్ దక్కించుకుంది. ప్రస్తుతం ముఖేష్ అంబానీ పేర్ల జోరుతో, టీసీఎస్‌కు దగ్గర స్థానంలోకి రిలయన్స్ వచ్చేసింది. ఈ ఏడాదిలో రిలయన్స్ షేర్లు 2 శాతం పడిపోయాయి. అదేవిధంగా వీటి తర్వాత మార్కెట్ విలువ ప్రకారం ఓఎన్జీసీ మరోసారి అత్యంత విలువైన ప్రభుత్వ రంగ సంస్థగా అవతరించింది.

## 'బడి' కి బై..!



**రా.వా.ప్రతినిది- కరిముల్లా, అమరావతి:** జిల్లావ్యాప్తంగాప్రభుత్వ,ప్రైవేటు. ఎయిడెడ్ పాఠశాలలకు ఈనెల23వ నుంచివేసవి సెలవులు ప్రకటించారు అన్ని పాఠశాలల్లోనూ శనివారం నాటితో పని దినాలు ముగియనున్నాయి. ప్రభుత్వ, జిల్లా పరిషత్ మండల పరిషత్ పాఠశాలలు జూన్ 12వ తేదీన పు:నప్రారంభమవుతాయి. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలను జూన్ 10వ తేదీన తెరుస్తామని విద్యార్థుల తల్లిదండ్రులకు సర్క్యులర్ జారీ చేశారు. కొన్ని కార్పొరేట్ సంస్థలు వేసవి సెలవులకు కోత విధించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరింస్తున్నాయనే విమర్శలున్నాయి. వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులంతా వేసవి సెలవుల అనంతరం రాకపోకలతో జిల్లాలో సందడి వాతావరణం నెలకొననుంది.

## మావోయిస్టుల అణచివేతకు అదనపు బలగాలు

**విశాఖపట్నం క్రైం :** విశాఖ ప్రాంతంలో మావోయిస్టుల అణచివేతకు కేంద్రం నుంచి అదనపు బలగాలను విశాఖ తీసుకువస్తున్నట్టు ఏపీ రాష్ట్ర డీజీపీ నండూరి సాంబశివరావు తెలిపారు. మూడు రోజులుగా ఉత్తరాంధ్రలో పర్యటిస్తున్న డీజీపీ విశాఖ కమిషనరేట్ సమావేశ మందిరంలో విశాఖ పోలీసులతో అంతర్గత సమావేశం నిర్వహించారు. మద్రిపాలెంలో తర్వలో రూ.7 కోట్లతో సైబర్ ల్యాబ్ ఏర్పాటుకు నిధులు విడుదల చేస్తామన్నారు. పర్యాటకులకు ఇబ్బందుకు తలెత్తకుండా ప్రతి పార్యాటక క్షేత్రంలో సిబ్బందిని ఏర్పాటుచేస్తామన్నారు. ఏఓబీ ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టులు మృతిచెందిన అనంతరం ప్రతిదాడులకు అవకాశం ఉన్నందున సీఎం చంద్రబాబుకు, తనయుడు మంత్రి లోకేష్‌కు ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటున్నామని డీజీపీ తెలిపారు. సమావేశంలో విశాఖ రేంజ్ డీఐజీ శ్రీకాంత్, విశాఖ ఏస్పీ రాహుల్‌దేవ్‌శర్మ, జేసీపీ సత్తార్‌ఖాన్, డీసీపీలు నవీన్‌గులాటీ, టి. రవికుమార్ మూర్తి పాల్గొన్నారు.

# ఉసిరి

మీ చిన్నతనం ఒకసారి గుర్తు చేసుకోండి. ఎండాకాలం వచ్చిందంటే చాలు సమీపంలోని చెట్లు బాగా ఉన్న ప్రాంతానికి వెళ్ళి నేరేడుపళ్ళు, ఈతపళ్ళు, ఉసిరికాయలు లాంటివన్నీ బాగా ఏరుకొచ్చుకునేవాళ్ళు కదూ! అబ్బ ఆ రోజులు ఎంత మధురంగా ఉండేది అనిపిస్తోంది. కదూ! తాజా ఉసిరికాయల పేరు చెబితే చాలు అందరి మదిలో కొన్ని జ్ఞాపకాలు మెదులుతాయి. సమ్మర్ సీజన్‌లో వచ్చేవాటిలో ఉసిరి కూడా ఒకటి. కొంచెం పుల్లగా ఉన్నా అబ్బబ్బ పులుపు అంటూనే అమ్మ, అమ్మమ్మల నుండి చిన్నపిల్లల వరకూ అందరూ ఉసిరి నోట్లో వేసుకునేవాళు ళ, ఉసిరితో పచ్చళ్ళు పట్టడం అందరికీ తెలిసిందే, దీనిని ఇప్పుడు స్నాక్స్‌లోనూ, డ్రింక్‌ల్లోనూ ఉపయోగిస్తున్నారు. తెలుసా! కారణం ఇందులో విటమిన్ సీ, పీచుపదార్థం పుష్కలంగా ఉంటుంది. అలాగని అదేపనిగా పచ్చివి తినలేం. పచ్చళ్ళూ లాగించలేం. మరింకెలా తినాలి అంటారా? పచ్చివి, పచ్చళ్ళే కాదు ఇతరత్రా రూపాల్లోనూ ఉసిరిని తీసుకోవచ్చు. ఉసిరితో షర్బత్‌లు, సలాడ్లు, కూడా చేసుకోవచ్చు. అవెలాగో తెలుసుకుందాం.

# షర్బత్‌లు – సలాడ్‌లు

## షర్బత్

నిమ్మకాయ షర్బత్ మాదిరిగానే ఉసిరికాయ షర్బత్ చేసుకోవచ్చు. దీనివల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలూ చాలానే ఉన్నాయి.

**కావలసిన పదార్థాలు**

తాజా ఉసిరికాయలు 100 గ్రాములు, పుదీనా ఆకులు 10 లేదా 12, చిన్న అల్లంముక్క నల్ల మిరియాలు ఒక టీ స్పూన్, వేయించిన జీలకర్ర పొడి రెండు టీ స్పూన్‌లు, బెల్లం పొడి రెండు టేబుల్ స్పూన్‌లు, ఐస్ ముక్కలు నాలుగు, నీళ్ళు మూడు కప్పులు



ఆరోగ్యం

**తయారీ విధానం**

ఉసిరికాయలు బాగా కడిగి నీళ్ళల్లో వేసి మెత్తగా అయ్యేవరకూ ఉడకబెట్టండి. తర్వాత వీటిలో గింజలు తీసేసి ఫుడ్ ప్రాసెసర్‌లో వేయండి. ఇందులోనే అల్లంముక్క, పుదీనా ఆకులు, వేయించిన జీలకర్ర పొడి, నల్ల మిరియాల పొడి, నీళ్ళు కూడా పోసి బాగా మెత్తగా చేయండి. తర్వాత ఇందులో బెల్లం పొడి కూడా వేసి మరోసారి తిప్పండి. అంతే దీనిని గ్లాసుల్లో పోసుకుని ఐస్ క్యూబ్స్ వేసుకోవడమే. నోరూరించే ఉసిరి షర్బత్ రెడీ.



## ఉసిరి సలాడ్

**కావలసిన పదార్థాలు**

ఉసిరికాయలు గింజలు తీసేసి ముక్కలుగా తరిగి నీళ్ళల్లో వేసి ఉడకబెట్టుకోవాలి. ఈ ముక్కలు అరకప్పు ఉండాలి. బాగా కడిగి శుభ్రం చేసిన బటన్ పుట్టగొడుగులు నాలుగు లేదా ఆరు, పన్నీరు 50 గ్రాములు, పాలకూర 200 గ్రాములు, జీడిపప్పు 50 గ్రాములు, రెండు వెల్లుల్లి రేకలు, రెండు టేబుల్ స్పూన్‌ల ఆలివ్ ఆయిల్, ఉప్పు తగినంత, మిరియాల పొడి సరిపడ.

**తయారీ విధానం**

పొయ్యి మీద పాన్ పెట్టి ఆలివ్ ఆయిల్ వేసి వేడి చేయండి. ఇందులో ముందుగా జీడిపప్పు వేసి బంగారు వర్ణం వచ్చేవరకూ వేయించండి. వేగాక వీటిని మరో గిన్నెలోకి తీసి పక్కన పెట్టుకోవాలి. తర్వాత తరిగిన వెల్లుల్లి రేకలు వేసి మంచి సువాసన వచ్చే వేయించాలి. ఇప్పుడు ముందుగా బాగా కడిగి శుభ్రం చేసి తరిగి పెట్టుకున్న పుట్టగొడుగులు వేయాలి. ఇవి మెత్తగా అయిన తర్వాత తరిగిన పాలకూర, తరిగిన ఉసిరి ముక్కలు, పన్నీర్ ముక్కలు, ఉప్పు, మిరియాల పొడి వేసి బాగా కలపాలి. మీడియం మంట మీద రెండు నిముషాలు ఉంచాలి. అంతే సలాడ్ ఉప్పు, రెడీ. దీనిని ప్లేట్‌లోకి తీసుకోవడమే. పైన జీడిపప్పుతో అలంకరిస్తే అందంగా కనిపిస్తుంది. లొట్టలు వేయిస్తుంది.

## ఉసిరి, వేరుశెనగ చెట్నీ



**కావలసిన పదార్థాల**

అరకప్పు ఉసిరి ముక్కలు, వేయించిన వేరుశెనగలు అరకప్పు, తురిమిన కొబ్బరి ఒక కప్పు, పుదీనా తరుగు అరకప్పు, కొత్తమీర తరుగు అరకప్పు ,రెండు పచ్చిమిరపకాయలు, 3 వెల్లుల్లి రేకలు, రుచికి సరిపడ ఉప్పు.

**తయారీ విధానం**

ఉసిరికాయల్లో గింజలు తీసేసి తరిగి ఉంచుకోండి. మొత్తం పైన చెప్పుకున్న పదార్థాలు అన్నింటినీ మిక్సీలో వేసి బాగా మెత్తగా అయ్యేలా చేయండి. దీనిని వేరొక గిన్నెలోకి తీసుకుని పైన కొబ్బరి తురుము అలంకరించండి. అంతే ఉసిరి, వేరుశెనగ పచ్చడి రెడీ. ఈ కొత్త రుచి అమోఘంగా ఉంటుంది. ఈ సారి మీరూ ప్రయత్నించండి.

## ఉసిరి, బీట్‌రూట్ షర్బత్



**కావలసిన పదార్థాలు**

గింజలు తీసేసిన ఉసిరికాయలు నాలుగు, ఒక బీట్‌రూట్, రెండు యాపిల్స్, రెండు టేబుల్ స్పూన్‌ల పుదీనా తరుగు, నాలుగు కప్పుల నీళ్ళు.

**తయారీ విధానం**

ఉసిరికాయలు, బీట్‌రూట్, యాపిల్స్‌ని ముక్కలుగా తరిగి జ్యూసర్‌లో వేయండి. ఇందులోనే కొంచెం నీళ్ళు, తరిగిన పుదీనా ఆకులు కూడా వేయండి. బాగా మెత్తగా అయ్యేవరకూ ఉంచి జ్యూస్‌లా చేయండి. అంతే దీనిని గ్లాసుల్లో పోసుకోవడమే. అలంకరణ కోసం, నోరూరించేందుకు గ్లాసుల్లో పైన పుదీనా ఆకులు, నిమ్మముక్కలు వేయండి.

---

## ప్రముఖ రచయితను సత్కరించిన పెన్‌జాప్



**రా.వా.ప్రతినిధి, మచిలీపట్నం, వి.నాగేశ్వరరావు:** ప్రముఖ రచయిత, సంఘ సంస్కర్త మచిలీపట్నం వాసి బత్రాజు శివరాజును జర్నలిస్ట్స్ సంఘ రాష్ట్ర నాయకులు బడే ప్రభాకర్, ఎన్జీవోస్ జిల్లా సంఘ నాయకులు దారపు శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. గురువారం ఆయన స్వగ్రామం లో జరిగిన ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమానికి అతిధిలుగా పాల్గొని వీరు శివరాజులోని సేవా భావాన్ని, ఒక రచయితగా ఆయన లోని ప్రజ్ఞ పాఠవాలను కొనియాడారు. ఈ సంధర్భంగా ఆయనను పూలమాలలతో, దుసాలువాతో నూతన వస్త్రాలను బహుకరించి సత్కరించారు. సహజ హితం కోరే మరిన్ని రచనలు చేయాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు.

## ఇంటికే పెట్రోల్, డీజిల్!

**న్యూఢిల్లీ :** పెట్రోల్ స్టేషన్ల పెద్ద పెద్ద క్యూలతో విసుగెత్తి పోయారా? మీకు ఆ చింత లేకుండా చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఓ వినూత్న ఆలోచన చేస్తున్నది.

ముందుగానే బుక్ చేసుకుంటే పెట్రోల్, డీజిల్‌లాంటి పెట్రోలియం ఉత్పత్తులను ఇంటికే తెచ్చి ఇవ్వాలన్న ఆలోచన ఉన్నట్లు కేంద్ర చమురువనరుల శాఖ ఓ ట్వీట్ చేసింది. ప్రతిరోజూ దేశావ్యాప్తంగా 3.5 కోట్ల మంది పెట్రోల్ స్టేషన్లకు వస్తున్నారు. ప్రతి ఏడాది వీటిల్లో రూ.2500 కోట్ల లావాదేవీలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇంటికే పెట్రోలియం ఉత్పత్తులు తీసుకురావడమన్న విన్నూత ఆలోచనకు కేంద్రం శ్రీకారం చుట్టడం ఆహ్వానించదగినదే.

## ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత మందులు పంపిణీ



**రా.వా.ప్రతినిధి -మచిలీపట్నం, వి.నాగేశ్వరరావు :** 14వ వార్డులో ఆయుష్ విభాగం, ప్రభుత్వ హోమియో వైద్యశాల వారి ద్వారా పిల్లలకు, వృద్దులకు ఈ వేసవి కాలంలో ఎండలకు వడ దెబ్బలు తగలకుండా ఉండటానికి ముందు జాగ్రత్తగా ఉచితంగా హోమియో మందులు పంపిణీ, ఒ.ఆర్.ఎస్. ప్యాకేట్స్, మజ్జిగ అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మున్సిపల్ చైర్మన్ మోటమర్రి వెంకట బాబా ప్రసాద్ ను ఆహ్వానించి, వారి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ హోమియో వైద్యాధికారి డాక్టర్ హరనాధ్, 14వ వార్డ్ టిడిపి ఇంచార్జ్ సుధాకర్, మరకాని పరబ్రహ్మం, దింటకుర్తి సుధాకర్, మెకానిక్ సుబ్బారావు, కలిల్ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతిలో ఇసుక తవ్వకాలకు స్వస్తి

**రా.వా. ప్రతినిధి– అమరావతి :** రాజధాని ప్రాంత పరిధిలోన గ్రామాల్లో ఇసుక, కంకర, గుల్ల, లాంటి ఖనిజాల తవ్వకాలను రాష్ట్ర ప్రభుత్వం నిలిపేసింది ఇప్పటికే అక్కడే అనుమతి పొందిన లీజులు రద్దు చేయడంతోపాటు కొత్తగా చేసుకున్న దరఖాస్తులను కూడా తిరస్కరించాలని ప్రభుత్వం నిర్ణయించినది. అమరావతి రాజధానిలో పెద్దఎత్తున నిర్మణాలు చేపట్టనుండటంతో రాజధాని అవసరాల కోసం ఇక్కడ ప్రాంతాల్లో ఉన్న తుళ్ళూరు, తాడికొండ, అమరావతి మండలాల్లోని ఆరు గ్రామాల పరిధిలో ఉన్న ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలు, గుల్ల కంకర,లాంటి ఖనిజాల తవ్వకాలను నిలిపేస్తూ రద్దు చేసింది. ఈ ప్రాంతాల్లో ఉన్న ఖనిజాలను కేవలం రాజధాని నిర్మణాం కోసమే వినిమోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.



# కార్పొరేట్ కబంధ హస్తాల్లో విద్య

ఆస్తులు, అంతస్థులు ఇవ్వలేముకాబట్టి పిల్లలకు నాణ్యమైన విద్య అందించి, వారి ఉజ్వల భవిష్యత్‌కు అంకురార్పణచేయాలన్న మధ్యతరగతి తల్లిదండ్రుల ఆశలను పెట్టుబడిగా చేసుకొని ప్రతిభగల విద్యార్థుల ఫొటోలతో ప్రతి ఏడాది రూ. 600 కోట్లకు పైగా వ్యాపారాలు చేస్తున్నాయి కార్పొరేట్ కాలేజీలు. అలా అని విద్యాప్రమాణాలు పెంచడం ఏం ఉండదు ..అన్నీ షార్టు కట్‌లే రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులను చేర్చుకొని, లక్షల్లో ఫీజులు గుంజి, కాస్త బాగా చదివిన వారిని ఇంకాస్త రుద్ది మంచి మార్కులు వచ్చేలా చేస్తారు. కాలేజీలో ఆటలు,పాటలు బంద్.. అవి కేవలం ఖార్కానాలు మాత్రమే.. అక్కడ తయారయ్యేది బట్టీ యంత్రాలే .. మధ్య తరగతి ఇళ్లు గడవాలంటే తల్లీదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలు చేయాలి కాబట్టి ఇంటికొచ్చి పిల్లలను చదివించుకొనే సమయం ఉండదు.దీంతో మేమే.. చదివిస్తాం..స్నాక్స్ ఇస్తాం..అంటూ పేరెంట్స్‌ని మురిపిస్తారు. అంతే దోపిడీకి సర్వం సిద్ధం.. మూస చట్రంలో ఇరుక్కుపోయి, సృజనాత్మకత చచ్చి, బ్రతుకు దర్భరంగా అనిపించి ప్రతి ఏడాది ఎంతో మంది విద్యార్థులు చనిపోతున్నా .. తల్లిదండ్రులకు ఇవేమీ పట్టడంలేదు.. మళ్లీ .. మళ్లీ ఇవే సంఘటనలు పునరావృతం అవుతున్నాయి. ఈ దందాలను ఆపాలంటే అవగాహనా కార్యక్రమాలు చాలా అవసరం.

10వ తరగతి ఫలితాలు రాకుండానే ఇప్పటికే పీఆర్‌ఓల పేరుతో ఇంటర్‌లో చేరబోయే పిల్లల ఇళ్లకు ఫోన్లు చేసి మా కాలేజీలో చేర్చండి, 30 శాతం రాయితీ ఇస్తామంటూ తల్లిదండ్రులను వేధిస్తుంటారు. వీరు ఇంటికి వచ్చినప్పుడు అప్లికేషన్ అయినా కొనాల్సిందే లేదంటే కదలరు. ఇంట్లోవాళ్లు పనులు చేసుకుంటుండటానికి చాలా అంతరాయం కలుగుతుంది. వీరికి ఏడాదిపాటు నెలకు 8 వేలరూపాయల చొప్పున చెల్లిస్తారు. ఇంకా వీరు కట్టించే ఫీజుల్లో 10 శాతం పొందుతారు. అందువల్ల వీళ్లంతా ఇంటర్ చేరే తల్లిదండ్రులను సతాయిస్తుంటారు. నిజానికి ఇవన్నీ నిబంధనలకు వ్యతిరేకంగా నడిచే కళాశాలలే.. ఇంటర్ బైపీసీ, ఎంపీసీ విద్యార్థులకు అసలు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ ల్యాబ్‌లు ఉండనే ఉండవు. దీంతో విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఉండనే ఉండవు. వీరికి స్లిప్పులు ఇచ్చి, ఇన్విజిలేటర్లను మేనేజ్ చేస్తుంటారు. మొన్నటికి మొన్న హిందీ పరీక్షకోసం కళాశాల సిబ్బంది స్లిప్పులు అందించడం వార్తాపత్రికల్లో చూశాం...లక్షలమందిని చేర్చుకొని పదుల సంఖ్యలో పిల్లలకు ర్యాంకులు వచ్చాయని చెప్పడం దారుణం.. మిగతా పిల్లలవద్దనుంచి కూడా పెద్దమొత్తాల్లో ఫీజులు గుంజి చదివేవారికి మాత్రమే ర్యాంకులు వస్తాయని నమ్మబలకడంలో అంతరార్థం తెలుసుకోవాలి. తామరతంపరగా పుట్టుకొచ్చిన ఈ కార్పొరేట్ కళాశాలల వల్ల ప్రభుత్వ కళాశాలలు శిధిలావస్థకు చేరాయి. సమాజంలోని అట్టడుగుస్థాయి విద్యార్థులు చదువుకునేందుకు అవకాశం లేకుండా పోయింది.

ప్రభుత్వం ఇప్పటికైనా విద్యపై శ్రద్ధాశక్తులు చూపాలి. దేశం అంతటా అందరికీ విద్యను అందుబాటులోకి తేవాలి. విద్యను నిర్లక్ష్యం చేస్తే భావిభారతం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ప్రభుత్వం గుర్తుంచుకోవాలి. బడుగు,బలహీన వర్గాలకు కూడా అత్యున్నత విద్య అందుబాటులోకి తేవడం ప్రభుత్వ బాధ్యత. లేదంటే రానున్న రోజుల్లో ప్రపంచదేశాల ముందు భారత్ తలదించుకోవాల్సి ఉంటుంది.

– బోస్

## రవికిరణ్ అరెస్ట్... విడుదల

**రావాప్రతినిధి,జాకీర్‌హుస్సేన్–తుళ్లూరు :** ఆంధ్రప్రదేశ్ పోలీసులు, హైదరాబాద్‌లోని ఇంటూరి రవికిరణ్‌ను శుక్రవారం తెల్లవారుజామున అరెస్ట్ చేసి శనివారం తెల్లవారు జామును వదిలేశారు. . పొలిటికల్ పంచ్ నిర్వాహకుడు. సోషల్ మీడియా వేదికగా పొలిటికల్ పంచ్ అనే పేజీని ఈయన 'పప్పు' పేరుతో చంద్రబాబు కుమారుడు నారా లోకేష్ మీద పొలిటికల్ పంచ్‌లు పేల్చాడు. పెద్దల సభ శాసన మండలి 'పెద్దలకు మాత్రమే' అని అర్థం వచ్చేలా వేసిన పొలిటికల్ పంచ్ నేపథ్యంలో ఇంటూరి రవికిరణ్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ వివరాలన్నిటినీ, పోలీసులు విడిచిపెట్టాక రవికిరణ్ వెల్లడించాడు. సాక్షి కోసం, వైఎస్సార్సీపీ కోసం పనిచేస్తున్నానని ఒప్పుకుంటే ఎలాంటి కేసులూ లేకుండా వదిలేస్తామని పోలీసులు చెప్పాంనీ, అయితే, తాను తన స్వంతంగా ఆ పేజీని నిర్వహిస్తున్నానని పోలీసులతో చెప్పానని అయితే ఈ నెల 25వ తేదీన తుళ్ళూరు పోలీస్ స్టేషన్‌కి విచారణ నిమిత్తం రావాలని పోలీసులు, అతనికి సూచించి వదిలేసినట్లు ఆయన తెలిపారు. తెలంగాణలో నివసించే వ్యక్తిని తమ అనుమతిలేకుండా తుళ్లూరు పోలీసులు అరెస్టు చేయడం చేయడం వివాదాస్పదమైందని అందువల్ల రవికిరణ్‌ను వదిలేశారని అంటున్నారు.

## బాబ్రీ విధ్వంసం తీవ్రమైన నేరం

### సుప్రీం తీర్పుతో కుట్ర జరిగిందని స్పష్టమైంది :ఒవైసీ

**హైదరాబాద్ :** బాబ్రీ మసీదు విధ్వంసాన్ని జాతి పిత మహాత్మాగాంధీ హత్య కంటే తీవ్రమైన నేరంగా భావించాలని ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యానించారు. గాంధీ హత్య ఘటనను రెండేళ్లలో విచారణ జరిపి పూర్తి చేస్తే.. బాబ్రీ కూల్చివేత ఘటనపై ఇంకా విచారణ కొనసాగుతోందన్నారు. బాబ్రీ కూల్చివేత ఘటన జాతి సిగ్గుపడాల్సిన అంశమని అభిప్రాయపడ్డారు. ఆయన అక్కడ మీడియాతో మాట్లాడారు. 1992లో బాబ్రీ విధ్వంసానికి కారకు లైనవారే నేడు దేశాన్ని పరిపాలిస్తున్నారని ఒవైసీ ఆరోపించారు. బాబ్రీ విధ్వంసం ఘటనలో నిందితులు మంత్రి పదవులు పొందడం శోచనీయమని కొందరు పద్మవి భూషణ్‌లు కూడా అందుకున్నారని వ్యాఖ్యానించారు. బీజేపీ అగ్రవేతలు ఎల్.కె.ఆడ్వాణీ,ఎం.ఎం.జోషి, ఉమాభారతిపై కేసు దర్యాప్తును కొనసాగించడానికి సుప్రీంకోర్టు సీబీఐకి అనుమతించడంతో బాబ్రీవిధ్వంసం కుట్రలో వీరు భాగస్వాములని స్పష్టమైదన్నారు.

## సాక్షి గ్రూప్‌పై పరువునష్టం దావా

### నారాయణ

**రా.వా ప్రతినిధి– విజయవాడ :** పురపాలకశాఖామంత్రి నారాయణ వై.యస్.జగన్ మోహన్‌రెడ్డికి చెందిన సాక్షి గ్రూప్‌పై పరువు నష్టం కేసు వేశారు. తన మీద, రాజధాని అమరావతి నిర్మాణంపై లేనిపోని అపోహాలు తప్పుడు వార్తాలు ప్రచారం చేస్తున్నారన్నారు. దీనిపై స్థానిక కోర్టులో కేసు వేసి జగన్‌ను ప్రతివాదిగా చేర్చారు.

# డబల్ రిజిస్ట్రేషన్ నియంత్రణతో భూములకు రక్షణ

### త్వరలో చుక్కల భూముల క్రమబద్ధీకరణ రెవెన్యూ శాఖ మంత్రి కేఈ కృష్ణమూర్తి

**కర్నూలు :** కొందరు స్వార్థపరులు ఒకే భూమిని ఒకరికి తెలియకుండా మరొకరికి విక్రయిస్తూ మోసాలకు పాల్పడుతున్నందున దీనిని అరికట్టేందుకు డబల్ రిజిస్ట్రేషన్ చట్టం అమలు చేస్తున్నట్టు రాష్ట్ర రెవెన్యూశాఖమంత్రి కేఈ కృష్ణమూర్తి అన్నారు. కర్నూలులోని ప్రభుత్వ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాల దృష్ట్యా భూముల రక్షణ కోసం ఇటీవల భూముల ధరలు విపరీతంగా పెరగడంతో భూములవిక్రయాల్లో మోసాలు చేస్తున్నారని, వీటి నియంత్రణకు 1908 రిజిస్ట్రేషన్ చట్టం సవరించామన్నారు. ఈచట్టంతో భవిష్యత్‌లో డబల్ రిజిస్ట్రేషన్లు ఉండవన్నారు. ఎవరైనా తమ భూమిని ఎవరికీ విక్రయించలేదని డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. డబల్ రిజిస్ట్రేషన్‌కు పాల్పడితే న్యాయపరమైన చర్యలకు వీలవుతుందన్నారు. బ్రిటిష్ పాలకుల కాలంలో భూముల సర్వేలో కొన్ని భూముల యజమాని పేరుగానీ, పట్టాదారుపేరుగానీ తెలియనప్పుడు చుక్కలు పెట్టి నమోదు చేశారని, అటువంటి భూముల యజమాని పేరుగానీ, పట్టాదారుపేరుగతానీ తెలియనప్పుడు చుక్కలు పెట్టి నమోదు చేశారని, అటువంటి భూములు రాష్ట్రంలోని రాష్ట్రంలోని అనంతపురం, కర్నూలు, కడప, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు, కృష్ణ, చిత్తూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో 24, 17, 707.64 ఎకరాలు ఉన్నాయన్నారు. వాటిని ప్రభుత్వ భూములుగా పరిగణించే వీలు లేకపోయినా 8, 558.11 ఎకరాలను వివిధ సంస్థలకు, వ్యక్తులకు కేటాయించారన్నారు. 16,73720.68 ఎకరాలను పేదలు, ఇతర వర్గాలకు కేటాయించగా, 3,41,679.33 ఎకరాలు కొందరు రైతుల స్వాధీనంలో ఉందన్నారు. ఈ భూములకు హక్కు ఆధార్ పత్రాలు పొందారన్నారు. ఏ ఆధారం లేకుండా 99,819.11 ఎకరాలు ఆక్రమణలో ఉన్నట్లు తెలిపారు. 2,16,779.07 ఎకరాలు ఎలాంటి ఆక్రమణలో లేన ప్పటికీ ప్రభుత్వ భూమిగా పరిగణించలేమన్నారు. చుక్కల భూముల యాజమాన్యపు హక్కులు దాఖలు చేయడానికి ఒక చట్టం తీసుకు రావాలని మంత్రిమండలి నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఈ చట్టం అమలులోకి వాచ్చేనాటికి 12 సంవత్సరాల ముందు నుంచి ఆధారాలు చూపించిన వ్యక్తుల పేర్లను మాత్రమే ఆర్ఎస్ఆర్‌లో నమోదు చేస్తామన్నారు. జిల్లాల్లోని భూమి సమస్యల పరిష్కార కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారన్నారు. మండల స్థాయిలో తహశీల్దార్ కన్వీనర్‌గా ఉంటారన్నారు. జిల్లా స్థాయి కమిటీ ఆరు నెలల్లో సమస్యను పరిష్కరించకపోతే సీసీఎల్ఏ అప్పీల్ చేసుకోవచ్చన్నారు. ఉత్తర్వులు జారీచేసిన నెల రోజుల్లోపు ఆర్ఎస్ఆర్, డిజిటలైజ్డ్ రెవెన్యూ రికార్డులో వివరాలు నమోదు చేయాల్సి ఉందన్నారు. భూ సేకరణలో నష్టపరిహారం, పారదర్శకత, హక్కుల పునరావాస కల్పన, పునర్‌నిర్ధారణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం 2013 లో తీసుకువచ్చిందని, 2014 జనవరి ఒకటో తేదీ నుంచి అమలులోకి తెచ్చిందన్నారు. ఈ చట్టంలో తాజా సవరణతో రైతు లకు 100 ఎకరాలు, అంతకంటే ఎక్కువ భూమి సేకరించి విషయంలో పరిహారం తోపాటు పునరావాస సహాయం ప్రకటించిన తర్వాతే వాటిని స్వాధీనం చేసుకోవాల్సి ఉందన్నారు.



## మే 1,2 తేదీల్లో జగన్ రైతు దీక్ష

**రావా ప్రతినిధి, జీవి రావ్ – హైదరాబాద్ :** వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు దరలు కల్పించడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 26,27 వ తేదీల్లో గుంటూరులో చేపట్టాలని పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి భావించిన రైతు దీక్షను మే 1,2 వ తేదీకి మార్చినట్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ ప్రకటించారు. పార్టీ కేంద్ర కార్యాలయం లోటస్‌పాండ్‌లో పత్రికల వారితో మాట్లాడుతూ అన్నదాతను ఏపీ సర్కార్ రోడ్డున పడేసిందన్నారు. రూ.5 వేల కోట్ల ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామని ప్రకటించిన చంద్రబాబును ఆ నిధి ఏమైందంటూ బొత్స ప్రశ్నించారు. వ్యవసాయం దండుగ అనే ఆలోచనలోనే ఇంకా చంద్రబాబు ఉన్నారంటూ ఎద్దేవా చేశారు. ఆత్మస్థైర్యాన్ని కోల్పవద్దంటూ రైతులకు హితవు పలికారు. మెడ వంచైనా మద్దతు ధర సాధిస్తామని ప్రకటించారు. రోజు రోజుకు రైతు సమస్యలు పెరుగుతున్నాయే తప్ప తగ్గుముఖం పట్టడం లేదన్నారు. ప్రభుత్వం సకాలంలో స్పందించకపోవడమే ఇన్ని సమస్యలకు కారణమన్నారు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర కూడా చెల్లించటం లేదన్నారు. సీసీఐ ద్వారా కొనుగోలు చేయిస్తామన్న చంద్రబాబు నాయుడు ప్రకటనలు ఉత్తరకుమారిడి ప్రగల్భాలు మాత్రమేనంటూ బొత్స వ్యాఖ్యానించారు. మిర్చికి మద్దతు ధర ఏదంటూ ప్రశ్నించారు. పత్తి స్కామ్‌లో దోషులపై చర్యలేవంటూ బొత్స నిలదీశారు.



## ఆగష్టులో ఏఎన్‌యూ వర్సిటీ స్నాతకోత్సవం

**ఏఎన్‌యూ :** యూనివర్సిటీ 35,36వ స్నాతకోత్సవం ఈ ఏడాది ఆగస్టు నెలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వీసీ ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్ తెలిపారు. జూన్‌లో జరిగే యూనివర్సిటీ పాలక మండలి సమావేశంలో స్నాతకోత్సవ నిర్వహణకు అనుమతి కోసం ప్రతిపాదనను పంపుతామన్నారు. తరువాత ముఖ్యఅతిథిగా, గౌరవ డాక్టరేట్లు గ్రహీతం ఎంపికకు సంబంధించి ప్రక్రియ చేపడతామన్నారు.

## ప్రమాద బాధితులకు మంత్రుల పరామర్శ

**రావా ప్రతినిధి, వెంకట్– తిరుపతి :** ఏర్పేడు ప్రమాద ఘటనను ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని మంత్రులు ఆరోపించారు. మ ృతుల కుటుంబాలకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ప్రమాదంలో గాయపడి తిరుపతిలోని స్విమ్స్, రుయా, బర్డ్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంత్రులు లోకేశ్, నారాయణ, అమర్‌నాథ్‌రెడ్డి, మాణిక్యాలరావు ఈరోజు పరామర్శించారు. వైద్యులను అడిగి వారి పరిస్థితి, అందిస్తున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. క్షతగాత్రుల పరామర్శల అనంతరం మంత్రులు ఏర్పేడు మండలం మునగలపాలెం బయలుదేరి వెళ్లారు. మ ృతుల కుటుంబాలను పరామర్శించడంతో పాటు ఆర్థిక సాయం అందించనున్నారు. ఏర్పేడు వద్ద జరిగిన ప్రమాదంలో మునగలపాలెంకు చెందిన 13 మంది మ ృత్యువాత పడ్డారు. దీంతో ఆ గ్రామం మొత్తం విషాదంలో మునిగిపోయింది.

# అందరి చూపు నంద్యాల వైపు

- ఉప పోరుకు సై అంటున్న శిల్పా–భూమా కుటుంబీకులు
- టీడీపీలో కలహాలపై కన్నేసిన వైసీపీ

**కర్నూలు :** నంద్యాల ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి ఆకస్మిక మరణంతో అనివార్యమైన ఉప ఎన్నిక అధికార తెలుగుదేశం పార్టీలో అలజడి రేపుతోంది. మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి,భూమా నాగిరెడ్డి కుటుంబసభ్యులు ఎవరికి వారు పోటీకి సిద్ధం కావడంతో ఉత్కంఠ నెలకొంది. తన తల్లి శోభా నాగిరెడ్డి వర్ధంతి రోజు అభ్యర్థిని ప్రకటిస్తామని రాష్ట్ర మంత్రి అఖిలప్రియ ఇప్పటికే అమరావతిలో వెల్లడించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నుంచి పిలుపురావడంతో శిల్పా సోదరులు అనుచరులతో కలిసి అమరావతి చేరుకున్నారు. శిల్పా సోదరులతో



శిల్పా మోహన్‌రెడ్డి



భూమా నాగిరెడ్డి

మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అచ్చెన్నాయుడు, ప్రత్తిపాటి పుల్లారావు,కళావెంకట్రావు చర్చించిన తర్వాత చంద్రబాబును కలిశారు. ఉప ఎన్నికపై త్వరపడి ఎటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని, రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్ ఉందని శిల్పా సోదరులకు భరోసా ఇచ్చినట్లు తెలిసింది. ఎన్నికల్లో పోటీ చేయకపోతే నమ్ముకున్న క్యాడర్ దూరమయ్యే పరిస్థితి నెలకొందని శిల్పా వివరించినట్లు తెలుస్తున్నది. ఏది ఏమైనా కార్యకర్తల అభీష్టం మేరకు నిర్ణయం తీసుకుంటానని మోహన్‌రెడ్డి ఖరాఖండిగా తేల్చిచెప్పినట్లు సమాచారం. అయితే సోషల్‌మీడియాలో మాత్రం 22,24 తేదీలలో శిల్పా మోహన్‌రెడ్డి వైసీపీలో చేరుతారని పెద్దఎత్తున ప్రచారం కొనసాగుతోంది. ఈ తరుణంలో తన తల్లి వర్ధంతి రోజు ఉప ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థిని ప్రకటిస్తానని మంత్రి భూమా అఖిలప్రియ ప్రకటించడం మరింత ఉత్కంఠకు తెరలేపింది. ఇటు శిల్పా కుటుంబం, అటు భూమా కుటుంబాలు పోటీకి సిద్ధం కావడం అధిష్టానానికి తలనొప్పిగా మారింది. శిల్పా మోహన్‌రెడ్డి తెలుగుదేశం పార్టీని వీడినా, వీడకపోయినా నంద్యాల రాజకీయం తారుమారయ్యే సూచనలు ఉండటంతో తమకు లాభిస్తుందని వైసీపీ నేతలు ఎదురుచూస్తున్నారు. నంద్యాల రాజకీయంలో మరో రెండురోజుల్లో ఎటువంటి పరిణామాలు చోటుచేసుకుంటాయా అని జిల్లా ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## రుచికి-శుచికి
## హనుమంతరావు హోటల్





**రాజధానివార్తలు డెస్క్ :** ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఒక కొత్త వాహనాన్ని త్వరలో రాజధాని అమరావతిలో ప్రవేశపెట్టనుంది . భూమిమీద, నీటిమీద వెళ్లగలిగే ఈ ఉభయచర వాహనాన్ని తీసుకురావటంలో కొంతజాప్యం జరిగినా త్వరలో ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నామని పర్యాటకరంగ అధికారులు తెలిపారు. ముందుగా కృష్ణా నదిలో విహారయాత్రకు నడిపించి, తర్వాత ప్రయాణికులను పున్నమి ఘాట్ నుంచి పవిత్ర సంగమం వరకు చేరవేస్తుందన్నారు. ప్రస్తుతం పోలవరంలో దీన్ని ట్రయల్‌రన్‌గా నడుపుతున్నామని, టూరిజం డైరెక్టర్ హిమాంశు శుక్లా తెలిపారు. కృష్ణానదిలో తిప్పటానికి ప్రస్తుతం ఆరు ఉభయచర వాహనాలను ముందుగా అందుబాటులోకి తెస్తున్నామని, రెండింటినీ సచివాలయ సిబ్బంది కేటాయించమని సి.ఆర్.డి.ఎ. అధికారులు కోరుతున్నారన్నారు. ఈ వాహనాలు పార్కింగ్ కోసం నదిఒడ్డున 8స్థలాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు.

# డాక్టర్లు జనరిక్ మందులే రాయాలి

- త్వరలో నిబంధనలు మారుస్తాం
- ప్రిస్క్రిప్షన్ అర్ధమయ్యేలా ఉండాలి
- ప్రధాని నరేంద్ర మోదీ

**సూరత్ :** తత్వమానమైన బ్రాండెడ్ మందులతో పోల్చుకుంటే రోగులకు చౌక ధరకు లభించే జనరిక్ మందులనే డాక్టర్లు రాసేవిధంగా నిబంధనలను సవరించి చట్టాన్ని తమ ప్రభుత్వం తీసుకురానున్నదని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తెలిపారు. పదిహేనేళ్ల తరువాత తమ ప్రభుత్వం ఆరోగ్య విధానాన్ని తీసుకువచ్చిందని, దానితో మందులు,స్టెంట్ల ధరలకు అడ్డుకట్టపడింది. ఇది కొన్ని మందుల కంపెనీలకు ఆగ్రహం తెప్పించిందని మోదీ తెలిపారు. ఆయన ఇక్కడ చారిటబుల్ హాస్పటల్‌ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, ధనవంతులు ముందుకు వచ్చి అవసరతలో ఉన్న ప్రజలకు ఆరోగ్య సంరక్షణను అందించటంలో తమ వంతు పాత్ర వహించాలని మోదీ నొక్కిచెప్పారు. దేశం ఒక్క రాజులు, నాయకులను మాత్రమే సృష్టించలేదు, ప్రజాశక్తిని కూడా సృష్టించిందని తెలిపారు. “ డాక్టర్లు రాస్తున్న ప్రిస్క్రిప్షన్‌ను పేద ప్రజలు అర్ధంచేసుకోలేకపోతున్నారు. వారి రాత వీరికి అర్ధంకావటంలేదు. వారు ఎక్కువ ధరకు ప్రైవేట్ స్టోర్లలో మందులను కొనుగోలు చేస్తున్నారు” అని మోదీ చెప్పారు. “ డాక్టర్లు ప్రిస్క్రిప్షన్ రాసేటప్పుడు అది అర్ధమయ్యే విధంగా ఉండాలి. అప్పుడు అది అర్ధం చేసుకుని పేదప్రజలు జనరిక్ మందులను కొనుగోలు చేయగలుగుతారు. ఇతర ఖరీదైన మందులను కొనుగోలు చేసే అవసరం ఉండదు.” అని చెప్పారు.“ మన దేశంలో డాక్టర్లు తక్కువ, ఆస్పత్రులు తక్కువ మందులు మాత్రం ఎక్కువ. మధ్యతరగతి కుటుంబంలో ఒక వ్యక్తి కనుక అనారోగ్యానికి గురైతే, ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తమైపోతుంది. ఆయన ఇల్లు కొనుక్కోలేడు, కూతుర్ల పెళ్లి చేయలేడు” అని ప్రధాని పేర్కొన్నారు.“ ప్రతి ఒక్కరూ నామమాత్రపు ధరకు ఆరోగ్య సేవలు పొందేవిధంగా చూడటం ప్రభుత్వ బాధ్యత” అని మోదీ చెప్పారు. “ఇటీవల మేము ఆరోగ్య విధానాన్ని ప్రకటించాం. 15 సంవత్సరాల తరువాత ఆరోగ్య విధానాన్ని తీసుకువచ్చాం. ఇంతకుముందు అటల్‌జీ(ఏబీ వాజ్‌పేయి) ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఆరోగ్య విధానాన్ని తీసుకువచ్చారు. ఆ తరువాత ఆరోగ్య రంగంలో ఏమీ మార్పు జరగలేదు. ఇప్పుడు మేము తీసుకువచ్చాం.” అని ప్రధాని చెప్పారు. మేము తీసుకువచ్చిన ఆరోగ్య విధానం కారణంగా 700 మందుల ధరలు అదుపులోకి వచ్చాయి. దానితో పేద ప్రజలు సహేతుకమైన ధరకు మందులను కొనుగోలు చేయగలుగుతున్నారని తెలిపారు.

## ప్రతిభగల పేద విద్యార్థులకు ‘విద్యార్థి’ హాస్టల్



**రా.వా.ప్రతినిధి, ఎం.భేగ్ (విజయవాడ) :** ప్రతిభ ఉండి, ఆర్థిక స్తోమత లేని విద్యార్థులను తీర్చిదిద్దే లక్ష్యంతో ‘విద్యార్థి’ హాస్టల్‌ను ప్రారంభించామని స్థానిక డాక్టరు మాజేటి మాధవి, ఆమె భర్త సురేంద్రనాథ్ తెలిపారు. కులమతాలకు అతీతంగా ఈ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా రూపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. 6 నుండి 10వ తరగతి వరకు చదువుకునేందుకు ఈ ఏడాది హాస్టల్‌లో 36 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. ఇది కేవలం హాస్టల్ అనే కాకుండా పిల్లలకు సొంత ఇంటిలాగా ఉంటుందన్నారు. నగర నడిబొడ్డున ఎస్.ఎస్.ఎం. పబ్లిక్ స్కూలుకు దగ్గరలో ఉన్న హాస్టల్ కమ్ స్కూలులో విద్య, వైద్యం, ఫీజులు, వస్త్రాలు, భోజన వసతి ఉచితంగా కల్పిస్తున్నామని సురేంద్రనాద్ తెలిపారు. విద్యార్థి అనే ఈ హాస్టల్‌ను ప్రహ్లాదరావు ఛారిటబుల్ ట్రస్టు నిర్వహిస్తుందన్నారు. సురేంద్రనాథ్ తండ్రి ప్రహ్లాదరావు విద్యార్థులకు ఉపకార వేతనాలు, పేదలకు సహాయం అందించటంతోపాటు వివాహాలు జరిపించి పలు సేవాకార్యక్రమాలు చేసేవారన్నారు. 1500 గజాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ హాస్టల్‌లో ఒక్కొక్క గదిలో 12 మంది విద్యార్థులు ఉంటారు. విద్యార్థులకు ఆటస్థలం , యోగా, సంగీతం మొదలైన సాంస్కృతిక కార్యక్రమాలు నేర్పించటం ద్వారా క్రమశిక్షణలోపాటు, ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్నామని సురేంద్రనాద్ తెలిపారు. ఆసక్తి కలిగిన తల్లిదండ్రులు ఈ 9346582838 సంప్రదించాలని సురేంద్రనాథ్ తెలిపారు.

## బెజవాడ హైవేపై
## 15 కి.మీ మేర స్తంభించిన ట్రాఫిక్

**విజయవాడ :** విజయవాడ హైవేపై 15 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కనకదుర్గ వారధిపై లారీ ఒకటి బ్రేక్‌డౌన్ అయింది. దీంతో హైవేపై 15 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోగా ప్రకాశం బ్యారేజ్‌పై రాకపోకలునిలిపివేయటంతో విజయవాడ వెళ్లే మార్గం లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా... బ్రేక్‌డౌన్ అయిన లారీని తొలగించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.



వెంకటపాలెం వద్ద కరకట్టపై రోడ్డు విస్తరణ పనులు చేస్తున్న కార్మికులు

## తక్కువ కులం...
## వేదాల్లో ఉందా?: వెంకయ్య

**రావాప్రతినిధి, గన్నవరం:** తక్కువ కులం...ఎక్కువ కులం అని వేదాల్లో ఉందా... అని కేంద్రమంత్రి ఎం. వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. శనివారం గన్నవరంలో బీజేపీ మూడేళ్ల పాలన విజయోత్సవ సభ జరిగింది. ఈ సభలో పాల్గొన్న వెంకయ్యనాయుడు మాట్లాడుతూ వృత్తులను బట్టే కులం... ఏ కులం తక్కువ కాదన్నారు. కుల వివక్ష పేరుతో జరిగే దురాచారాలను ఆపాలన్నారు. బీజేపీలోనే ఎక్కువ మంది దళిత, వెనుకబడిన వర్గాలకు చెందిన ఎంపీలు ఉన్నారని, అంతేగాక బీజేపీలోనే ఎక్కువ మంది మహిళా ఎంపీలు ఉన్నారని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. బీసీ కమిషన్‌కు కేంద్రం రాజ్యాంగ బద్ధత కల్పించిందని, బీసీల కలను సాకారం చేశామన్నారు.

# వీధి బాలలకు పునరావాసం!

**మెప్మా ఆధ్వర్యంలో సాధికారిత**

**రా.వా ప్రతినిధి- అమరావతి :** వీధి బాలల సాధికారతకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మెప్మా ఆధ్వర్యంలో ‘ర్యాగ్ పిక్కర్స్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రాం’ను రూపొందించారు. దానికి సంబంధించిన పుస్తకాన్ని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. పేదరికం లేని సమాజం కోసం పని చేస్తున్నామని, ప్రతి కుటుంబానికి నెలకు రూ.10 వేల ఆదాయం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. వీధిబాలలకు చదువు నేర్పించడంతోపాటు భవిష్యత్తులో గౌరవప్రదమైన వృత్తిలో స్థిరపడేలా చూడాలన్నారు. కాగా, వీధి బాలలు చదువుకొనేలా దిశగా అడుగులు వేయించడం, గౌరవప్రదమైన వృత్తికి ఎంచుకోనేలా చూడటం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమంలో భాగంగా చిత్తు కాగితాలు ఏరుకొనే వృత్తి నుంచి బయటకు వచ్చేవారికి పునరావాసం కూడా కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 15 పట్టణాల్లో 13 స్వచ్ఛంద సంస్థల సహకారంతో 17500 మంది ర్యాగ్ పిక్కర్స్‌ను గుర్తించి పునరావాసం కల్పించారు. ఇకపై ర్యాగ్‌పిక్కర్స్‌ను శానిటరీ వలంటీర్‌గా పిలవాలని ప్రభుత్వం సూచించింది. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ పాల్గొన్నారు.



## జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలు

తుళ్ళూరు మండలం రాయపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం వేడుకలు సర్పంచ్ రెంటపల్లి నాగమణెమ్మ అధ్యక్షత వహించి ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటప్పయ్య మండల అధికారి. ఎపిటీసీ, వార్డు సభ్యులు అంగన్‌వాడీ కార్యకర్తలు జన్మభూమి, కమిటీ సభ్యులు పంచాయితీ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

– రా.వా ప్రతినిధి, రాయపూడి

# మాల్యా అరెస్టు - బెయిలు

భారీ మొత్తంలో బ్యాంకుల్ని ముంచి నిరుడు గుట్టు చప్పుడు కాకుండా లండన్‌కు ఉడాయించిన వ్యాపారవేత్త విజయ్ మాల్యా చాన్నాళ్ల తర్వాత మంగళవారం మళ్లీ కాసేపు మీడియాలో మార్మోగాడు. ఆయన అరెస్టయ్యాడంటూ మీడియాలో వెల్లడికావడం ఆ సంచలనానికి కారణం. కోట్లాదిమంది ఖాతాదార్లు పొదుపు చేసుకున్న సొమ్ముతో తాము వ్యాపారం చేస్తున్నామన్న స్పృహను కోల్పోయిన బ్యాంకులు ఆయన అడిగినప్పుడల్లా అడిగినంతా ఇచ్చాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు ఆయన బకాయిలు వడ్డీతో కలిపి రూ.9.018 కోట్లకు చేరుకున్నాక మేల్కొని కాళ్లా వేళ్లా పడ్డాయి. అంతక్రితం సంస్థలు సంక్షోభంలో పడినా, జీతాలివ్వడంలేదని ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నా బ్యాంకులు పట్టనట్టు ప్రవర్తించాయి. కింగ్‌ఫిషర్ నష్టాల్లో కూరుకుపోతున్నదని, ఆయనకు చెందిన ఇతర సంస్థలు కూడా ఆ దారిలోనే ఉన్నాయని, మాల్యా దగ్గర సెక్యూరిటీగా చూపేందుకు కొత్తగా ఆస్తులు మిగల్లేదని తెలిసినా కేవలం వ్యక్తిగత హామీతో ఆయనకు అప్పులిచ్చిన సందర్భాలున్నాయి. తమకు బకాయి వడ్డ రూ.900 కోట్ల రూపాయల విషయంలో ఆయనపై కేసు పెట్టిన తొలి బ్యాంకు ఐడీబీఐ. మిగిలిన బ్యాంకులు ఆ పని చేయడానికి అనేక నెలల వ్యవధి తీసుకున్నాయి. రైతులు, సామాన్యులు బకాయిపడితే వాటి వసూలు కోసం ఇళ్ల తలుపులు ఎత్తుకుపోవడం. తాళిబొట్లు తీసుకెళ్లడం మొదలుకొని అడ్డమైన పనూలు చేసే బ్యాంకులు మాల్యా ముందు మోకరిల్లాయి.

విజయ్ మాల్యా విషయంలో ఇప్పుడు జరిగిన పరిణామం వల్ల పెద్దగా ఒరిగే దేమీ లేదన్నది న్యాయ నిపుణుల భావన. మనకు బ్రిటన్‌తో నేరస్తుల మార్పిడి ఒప్పందం ఉండొచ్చుగానీ అందుకు సంబంధించిన ప్రక్రియ ఎంతో సుదీర్ఘమైనది. అందులో ఎన్నో సంక్లిష్టతలు, చిక్కుముడులు ఉంటాయి. వాటన్నిటినీ జాగ్రత్తగా పరిశీలిస్తే మాల్యా ఈ దేశానికి రావడం ఇప్పట్లో సాధ్యమేనా అన్న అనుమానాలు తలెత్తుతాయి. ప్రతి దశలోనూ తీసుకునే నిర్ణయాన్ని సవాలు చేయడానికి ఆయనకు అనేక అవకాశాలుంటాయి. నిరుడు మార్చిలో విజయ్ మాల్యా పరారయ్యాక ఆ మరుసటి నెలలో కేంద్ర ప్రభుత్వం ఆయన్ను అప్పగించాలంటూ బ్రిటిన్ ప్రభుత్వాన్ని లాంఛనంగా కోరింది. కేవలం అరెస్టు చేసి బెయిల్ ఇవ్వడానికి ఇన్నాళ్ల కాలం పాస్‌పోర్టులు రద్దయినా వెనక్కు పంపడం సులభంకాదు. పైగా బ్యాంకులకు మాల్యా ఎగ్గొట్టిన సొమ్ము ఆయన వ్యక్తిగత హోదాలో తీసుకున్నది కాదు. కంపెనీ అధిపతులైనా సంస్థ తాలూకు అప్పులకు నేరుగా బాధ్యులుగా మారరు. మాల్యా వ్యక్తిగత హామీతో కొన్ని రుణాలు తీసుకున్న మాట వాస్తవమైనా వాటిని చూపి మాల్యాను అప్పగించమనడం కుదరదు. ఆయన నేరస్తుల అప్పగింత ఒప్పందం పరిధిలోకొచ్చే అపరాధం చేశాడని మన విదేశాంగ శాఖ తరపున వినిపించి వాదనలకు సంతృప్తిచెంది బ్రిటన్ కోర్టు ప్రస్తుతం అరెస్టు వారెంట్ జారీ చేసి, తన ముందు హాజరుపరిచాక బెయిల్ మంజూరు చేసింది. విచారణ సమయంలో ఆయన లేవనెత్తే



విధానపరమైన అనేక అభ్యంతరాలు గడిచి అంతా సవ్యంగా పూర్తయితే, ఆ తర్వాత మానవ హక్కుల ఉల్లంఘన అంశం తెరపైకి వస్తుంది. కింద కోర్టు అప్పగించాల్సిందేనని ఆదేశాల్చినా హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో అప్పీల్ చేసుకోవచ్చు. ఈ అవరోధాలు దాటుకుని మాల్యాను రప్పించడానికి చాలా సమయం పడుతుంది. అయినా ఇదంతా చేయక తప్పదు. అయితే దీన్నుంచి గుణ పాఠం తీసుకోవడం తేలిక. మాల్యా మాదిరే బ్యాంకులకు కోట్లాది రూపాయలు బకాయిపడి, పెద్ద మనుషుల్లా చలామణి అవుతున్నవారు చాలా మంది ఉన్నారు. వారి సంగతి తేల్చాలి. వారికి నిర్దిష్టమైన గడువు ఇచ్చి ఆ తర్వాత సివిల్, క్రిమినల్ చర్యలకు ఉపక్రమించాలి. వారు దేశం విడిచిపోకుండా చూడటం అన్నిటికన్నా ముఖ్యం. అప్పుడు మాత్రమే బ్యాంకుల నుంచి మాయమైన సొమ్ము భద్రంగా వెనక్కు వస్తుంది.

– ఖాన్

## 26,27ల్లో మారిషస్‌లో ప్రపంచ తెలుగు మహాసభలు

**రావా ప్రతినిధి తిరుపతి – టి.వెంకట్:** మారిషస్‌లో ఈ ఏడాది నవంబర్ 25, 26 తేదీల్లో 15వ ప్రపంచ తెలుగు కల్చరల్ ట్రస్టు ఉపాధ్యక్షుడు ఆచార్య బృందావనం పార్థసారథి తెలిపారు. తిరుమలలో ఆయన విలేకరులలో మాట్లాడారు. ముంబయిలో ఈ నెల –15, 16వ తేదీల్లో 14వ ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయని, ఈ సభల్లో మారిషస్ ఉపాధ్యక్షుడు పరమశివంపిళ్లెత్తోపాటు 9 మంది ప్రతినిధులు పాల్గొన్నారని చెప్పారు. ఈ సందర్భంగా 15వ ప్రపంచ తెలుగు మహాసభలు మారిషస్‌లో నిర్వహించాలని నిర్ణయించామన్నారు.

## హోదా సాధన కోసం పట్టుపట్టండి

**సీఎంకు కాంగ్రెస్‌రాజ్యసభ సభ్యుడు కేవీపీ బహిరంగ లేఖ**

**రా.వా.ప్రతినిధి ఎం. రవికుమార్ అమరావతి :** ఈనెల 29న జరిగే నీతీ అయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా నిర్ణయం జరిగేలా సీఎం చంద్రబాబు చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు సూచించారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి పేరుతో బహిరంగ లేఖ రాశారు. ప్రత్యేక హోదా సాధనకు నీతీ అయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం గవర్నింగ్ కౌన్సిల్ సమావేశాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. పోలవరం ముంపు మండలాల విలీన విషయంలో కేంద్రాన్ని ఏ విధంగా బెదిరించి సాధించుకున్నారో అదే విధంగా హోదా ఇవ్వకపోతే ముఖ్యమంత్రిగా కొనసాగలేనంటూ మారం చేయడమే కాకుండా మంకుపట్టు పట్టాలని కేవీపీ కోరారు. ప్రత్యేక హోదాపై కేంద్రం ఆడుతున్న నాటకాల మీకు తెలియనవి కాకపోయినా వాటిని ఒకసారి గుర్తు చేయడం నా బాధ్యతగా భావించి ఈ లేఖ రాస్తున్నట్లు పేర్కొన్నారు.



# పథకాల అమలులో తూర్పుగోదావరి ఫస్టు : గల్లా

**రావా ప్రతినిధి కోనసీమ –జిఎన్.రావ్ :** భవన నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలులో రాష్ట్రంలోని 13 జిల్లాల్లో తూర్పుగోదావరి జిల్లా ప్రథమ స్థానంలో ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భవన, ఇతర నిర్మాణ కార్మికుల బోర్డు సభ్యులు గల్లా రాము తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల వివిధ సంక్షేమ పథకాలు క్రింద మార్చి 31వ తేదీ నాటికి 21,180 మందికి రూ.27కోట్ల 90లక్షల 22వేల, 925 ఖర్చు చేయడం జరిగిందని చెప్పారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. సహజ మరణం చెందిన కార్మికులకు 3800మందికి రూ.12.39కోట్లు, వివాహ కానుకకు 766మందికి రూ.47.65లక్షలు, ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికులకు ఆర్థిక సహాయం 163మందికి రూ.3కోట్ల 94లక్షల 70వేలు, శాశ్వత అంగవైకల్యానికి గురైన కార్మికులు 13మందికి రూ.12.50లక్షలు, తాత్కాలిక అంగవైకల్యానికి గురైన 31మందికి రూ.2లక్షల 56వేల 300, లబ్దిదారులుగా నమోదు కాని 10మందికి రూ.4లక్షలు దహన సంస్కారాలకు 1834మందికి రూ.2కోట్ల 19లక్షల 30వేలు లబ్దిదారులకు అందజేయడం జరిగిందని అన్నారు.



నిర్మాణ రంగ కార్మికులకు శిక్షణ నైపుణ్యాలు క్రింద 10,245మందికి రూ.3కోటల 51లక్షల 51,625 ఖర్చు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 2లక్షల 45వేల 220మంది కార్మికులు రిజిష్టర్ చేయించుకున్నారని, ఒక లక్షా 65వేల 70మంది రెన్యువల్ చేయించుకున్నారని, మిగతా కార్మికులంతా రెన్యూవల్స్ చేయించుకోవాలని సూచించారు. కొత్తగా నమోదు చేయించుకుని సంక్షేమ పథకాలు పొందాలని కోరారు. కొత్తగా కార్మికుడు బో×ర్డులో చేరాలంటే దరఖాస్తుతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50, సంవత్సర చందా రూ.12 చొప్పున ఐదు సంవత్సరాలకు రూ.110 రేషన్‌కార్డు లేదా ఏదైనా గుర్తింపు కార్డు జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో నమోదు చేయించుకోవచ్చునని తెలిపారు. ఒక కార్మికుడు ఒక సభ్యత్వం మాత్రమే పొందాలని అన్నారు. ఒక కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ నిర్మాణ కార్మికులు ఉంటే వేర్వేరుగా నమోదు చేయించుకుని రశీదు పొందాలని రాము తెలిపారు.

## ప్రకృతి రక్షణ సామాజిక బాధ్యత : సీఎం

**రా.వా.ప్రతినిధి , కరిముల్లా, అమరావతి:** ప్రక ృతిలో అనుసంధానమైన మనిషి ప్రక ృతిని పరిరక్షించాలని ధరిత్రి దినోత్సవం సందరరేగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపుని చ్చారు. కాలుష్యం తగ్గించగలిగితేనే పుడమికి రక్ష అని పేర్కొన్నారు. భూసారం క్షీణించకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని... భూసార పరీక్షలు ఇందులో భాగమేనని తెలిపారు. పర్యావరన పరిరక్షణ ప్రతి ఒక్కరూ తమ సామాజిక కర్తవ్యంగా భావించాల న్నారు. రాష్ట్రంలో పచ్చదనం పెంచడం ద్వారా చల్లదనం ఉంటుందని.. ఇందుకు తగ్గట్లుగా చర్యలు తీసుకుని కనీసం 2శాతం ఉషో?గ్రతలు తగ్గించగలిగితే రాష్ట్రంలో మరింత ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని ఆకాంక్షించారు.

## ప్రభుత్వ భూముల్లో పోర్టు ఎందుకు నిర్మించరు



**రా.వా.ప్రతినిధి–మచిలీపట్నం, వి.నాగేశ్వరరావు :** ప్రభుత్వ భూముల్లోనే పోర్టును ఎందుకు నిర్మించరని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. స్థానిక నాయుడుబడ్డీ సెంటర్‌లోని అతిథి గృహంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా తెదేపా నాయకులు బందరు పోర్టును కచ్చితంగా నిర్మిస్తామని వాగ్దానం చేశారన్నారు. పోర్టు నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ భూములు ఉండటమే కాకుండా అదనంగా 650 ఎకరాలు అసైన్డ్ భూములు కూడా ఉన్నాయని తెలియజేశారు. మొదట పోర్టు నోటిఫికేషన్ ఇచ్చిన సమయంలో తమ భూములను అమ్ముకునే వీల్లేదని, ఆ తర్వాత భూసమీకరణ చట్టం తీసుకువచ్చి ఉన్నతాధికారుల అనుమతితో అమ్ముకునే వీలు కల్పించాలన్నారు. ఏ విధంగా అయినా రైతుల నుంచి భూములను కచ్చితంగా తీసుకునే చర్యలు చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2012లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 5 బెర్త్‌ల నిర్మాణానికి ల్యాండ్ పాలసీ జీవో నెం.521 ప్రకారం ఎయిర్‌పోర్టు తదితర వాటికి ఎంత భూమి కావాలో నిపుణులతో అంచనా వేయించినట్లు చెప్పారు. కాకినాడ పోర్టు కేంలం 400 ఎకరాల్లోనే నడుస్తోందని, దీని ప్రకారం చూసినా బందరు పోర్టు నిర్మాణానికి వెయ్యి ఎకరాల్లో నిర్మాణ పనులు మెదలు పెట్టవచ్చునని స్పష్టం చేశారు.గతంలో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడే నవయుగ సంస్దకు మద్య అనుబంధం ఏర్పడిందన్నారు. ఇప్పుడున్న తెదేపా ముఖ్యమంత్రికి, ఆసంస్దకు మద్య కూడా ఇదే బందం ఏర్పడిందని చెప్పారు. రైతుల నుంచి తీసుకున్న భూములపై బ్యాంకుల నుంచి అధిక మొత్తంలో సొమ్ములు తీసుకుని సంస్ద లబ్ది పొందుతున్నా సంగతి తెలుసుకోవాలన్నారు. పోర్టుకు వ్యతిరేకం కాదని, ప్రభుత్వ భూముల్లోనే నిర్మించాలని ఆయన కోరారు.

# టెంపుల్ టూరిజానికి అత్యంత ప్రాధాన్యత

**నిమ్మకాయల చినరాజప్ప**

**రావా ప్రతినిధి కోనసీమ –జిఎన్.రావ్ :** పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే అంశంలో భాగంగా టెంపుల్ టూరిజానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మంత్రి సతీసమేతంగా మామిడికుదురు మండల అప్పనపల్లిలో వేంచేసియున్న శ్రీబాలబాలజీ స్వామివారిని దర్శించుకుని అనంతరం హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ అప్పనపల్లి శ్రీబాలబాలాజీస్వామి దేవస్థానం 25 సంవత్సరాలు క్రితమే రామస్వామి ఆధ్వర్యంలో ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని, ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చాక మరింత అభివృద్ధి చెందిందని మంత్రి అన్నారు. గోదావరి, కృష్ణా పుష్కరాల సందర్భంగా పుష్కర నిధులతో దేవాలయాలను ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేసిందని అన్నారు. తూర్పు, పశ్చిమ, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పాత దేవాలయాలను పునరుద్ధరించి అభివృద్ధి చేయడం జరిగిందని మంత్రి అన్నారు. ఐదువేల మంది భక్తులకు నిత్యం అన్నప్రసాదం అందజేయడం జరుగుతుందని, పెద్ద దేవాలయాలన్నింటిని టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేస్తామని మంత్రి అన్నారు. విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం, శ్రీశైలం దేవస్థానములు ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో నడుస్తున్నాయన్నారు. తిరుపతిలో దేవుని ఆదాయంతో దేవాలయాల అభివృద్ధితో పాటు ఉచిత భోజనం, విద్య, వివాహాలు వంటి కార్యక్రమాలు ఎంతో వైభంగా జరుగుతున్నాయిన అన్నారు. ముందుగా మంత్రి దంపతులకు ఈవో, ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ మొల్లేటి శ్రీనివాస్, ఈవో వివివిఎస్ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న నిమ్మకాయల చినరాజప్ప

# జీవిత మకరందం చవిచూద్దాం...



ఎత్తైన కొండలు, కోనలు దాటి నీటి ప్రవాహం పల్లానికి చేరుతుంది.... తన ప్రయాణంలో అనేకమందికి దాహం తీర్చడానికి, విరగ కాసిన చెట్ల పండ్లన్నీ కిందికే వేలాడుతుంటాయి... బాటసారుల ఆకలి తీర్చడానికి, అది ప్రకృతి సహజం. మనిషి కూడా అంతే. జీవితంలో ఎన్ని మలుపులు , గమ్యాలున్నా జీవన మాధుర్యాన్ని కోల్పోకూడదు. తేనెలోని ప్రతి చుక్క రుచిని చవిచూసినట్లే జీవిత మాధుర్యాన్నీ ఆస్వాదించాలి. ఉరుకుపరుగుల జీవితంతో మనల్ని రీచార్జ్ చేసే అందమైన ప్రకృతిని ఆస్వాదించలేకపోతున్నాం.... సూర్యోదయం ...సూర్యాస్తమాన్ని ఎంతమందిమి చూడగలుగుతున్నాం. మండే ఎండా ...కురిసే వానను చూసి ఎన్నాళ్లైందో కదా.. నేటి టెక్నాలజీ యుగంలో సెల్‌ఫోన్లు, కంప్యూటర్లకు బానిసలైపోయి, ఆప్తులను ప్రేమగా పలకరించినది ఎన్నాళ్లైందో..

ఆపదలో ఉన్న వారికి, అవసరంలో ఉన్నవారికి ఆప్యాయంగా మాట్లాడే ఒక మాట ఎంతటి శక్తిని నింపుతోందోకదా.. వారు కోలుకొని మనం చెప్పిన చిన్నమాట తమ జీవితాన్ని ఎంతగా మార్చిందో తెలియచేస్తే మన గుండె ఎంత పొంగిపోతుందో.. ఈ ప్రపంచంలో ప్రాణానికి సమానమైంది ఏదీ లేదని మనందరికీ తెలుసు ...ప్రమాదానికి గురైన ఒక్కరిని లేపి మంచినీళ్లిస్తే.. వారి కళ్లలో కనిపించే కృతజ్ఞత ఎలా ఉంటుందో మనలో ఎంతమందికి తెలుసు? ప్రమాదంలో రక్తమోడుతున్న ఒక్క వ్యక్తిని సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రాణాపాయం నుంచి తప్పిస్తే వారి కుటుంబం చేతులెత్తి మొక్కుతూ మిమ్మల్ని దేవుడిని చేసే సందర్భం ఎప్పుడైనా చవిచూశారా ? ఆ ఆనందాన్ని మీరు డబ్బుతో ఎప్పటికీ కొనలేరు.. ఇప్పుడు చెప్పండి జీవితం ఇంత నిస్సారంగా, నిస్తేజంగా గడపాలా ?....ఎవరో నడిరోడ్డుమీద దిక్కులేకుండా పడి ఉంటే నేనే...ఎందుకు సమయం వృధా చేసుకోవాలీ అనుకుంటున్నట్లయితే మీరు తప్పు చేస్తున్నట్లే... ఆ సమయంలో మీ ఆత్మీయులో,మీరు ప్రేమించేవారో ఉంటే అలా వెళ్లిపోగలుగుతారా ? మరి గాయపడిన వారికి ఆత్మీయులు, అభిమానులు ఉంటారుకదా...తోటి వారు సాయం చేయక, అయిన వారిని కోల్పోయిన వారి వేదన ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుంటే మనం కసాయివారిలా ఉండలేం..

పిల్లలకు ప్రేమను పంచడమంటే మార్కెట్లో ఖరీదైన వస్తువులతో వారిని ఆశ్చర్యానికి గురిచేయడం కాదు...వారి బుల్లి మాటలను వినటం...వారికి జాగ్రత్తలు చెబుతూ.. మంచిదారిలో పయనించే విధంగా వారిని తీర్చిదిద్దడం...ఈదేశానికి అత్యున్నత పౌరులను అందించడం అంతేకాని, ఏటీఎంలను తయారుచేయడం కాదని గుర్తించాలి.

ఎంత సంపాదించినా..ఎన్ని సుఖాలున్నా... ఎవరికైనా సాయం చేశావా అని నీ అంతరాత్మ ఏదో ఒక రోజు ప్రశ్నిస్తే ... మన పరిస్థితి ఏమిటి ? ఒక్కరికి కూడా సాయం చేయలేకపోయాను ఎప్పుడైనా మనసుకు వస్తే శూన్యంగా అనిపించకమానదు... అందుకే ఎంత సంపాదించినా తృప్తి లేని జీవితం గడుపుతూ చాలా మంది అంత్యకాలంలో దానధర్మాలు చేస్తుంటారు. అయితే నిజాయితీగా బ్రతుకుతూ సాటివారికి సాయపడుతూ ఉండేవారికి గుండెగదులన్నీ ఆత్మసంతృప్తితో నిండి ఉంటాయి. కత్తి పట్టిన కసాయైనా, తుపాకీపట్టిన టెర్రరిస్టయినా హింసోన్మాదంతో విసుగు వచ్చి సాటివారికి సాయం చేయడం కంటే జీవితం మరేదీ లేదని తెలుసుకోక తప్పదు. ముస్లిం కట్టుబాట్ల పేరుతో దేశంలో అరాచికాలు సృష్టించిన ఆఫ్ఘనిస్థాన్ తాలిబన్ నేత హైబతుల్లా... అరె కత్తులు... కటార్లు మాని చెట్లు నాటండి అంటున్నాడు ...ఊరి చెరువుల నుంచి కాలువకు , కాలువ నుంచి నదికి నదినుంచి సముద్రానికి నీరు చేరుతుంది. జీవితం కూడా అంతే... చనిపోయే క్షణాన నాఈజీవితంలో ఇంతమందికి సాయం చేశానను కుంటే ఎంత సంతృప్తిగా ఉంటుంది.

– విజయశ్రీ

**( రోడ్డు ప్రమాదాల్లో ప్రతి గంటకు 16 మంది, రోజుకు 382, ఏడాదికి 1,46,133 మంది చనిపోతున్నారన్న రాజ్యసభ గణాంకాలతో, ఈ నెల 2న కర్ణాటకలోని కొప్పాల్ రోడ్డు ప్రమాదానికి గురైన బాలుడు అన్వర్ ఆలీ ఫోటోలు తీస్తూ , వైద్యసాయం అందించడానికి నిర్లక్ష్యం చేశారన్న వార్తకు స్పందనగా)**

## ముస్లింలకు గుర్తింపు రాజ్యాంగమే ఇచ్చింది : ఒవైసీ

**రావా ప్రతినిధి, హరీష్, హైదరాబాద్:** ముస్లింలకు గుర్తింపు ఇచ్చింది రాజ్యాంగమే కానీ, రవిశంకర్ ప్రసాద్ కాదని ఒవైసీ తెగేసిచెప్పారు. ముస్లింలు తమకు ఓటు వేయకపోయినా కేంద్రం వారికి తగిన గౌరవం ఇచ్చిందంటూ కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ చేసిన వ్యాఖ్యలపై ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కేంద్ర మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. రాజ్యాంగమే అందరికీ సుప్రీం అని, రాజ్యాంగం ముస్లింలకు హక్కులు ప్రసాదించిందనీ, వారి హక్కుల పరిరక్షణ బాధ్యత రాజ్యాంగానిదేనని ఆయన స్పష్టం చేశారు. ఇండియా వంటి ప్రజాస్వామిక దేశంలో నేతలను ఎన్నుకునే స్వేచ్ఛతమకు ఉందని, రాజ్యంగమే సుప్రీం అనే విషయం రవిశంకర్ ప్రసాద్ గ్రహించడం మంచిదని ఒవైసీ హితవు పలికారు. ఓ కార్యక్రమంలో రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ, ముస్లింలు బీజేపీకి ఓటేయలేదని, అయినప్పటికీ ప్రభుత్వం వారికి తగిన గౌరవాన్ని ఇచ్చిందని అన్నారు. 12 రాష్ట్రాల్లో సొంతంగా తమ ముఖ్యమంత్రులు ఉన్నారని, పరిశ్రమలు, ప్రభుత్వ సర్వీసుల్లో ఉన్న ఏ ముస్లింను వేధింపులకు గురిచేయడం కానీ ఉద్యోగం నుంచి తొలగించడం కానీ చేయలేదని అన్నారు. బీజేపీకి ముస్లింలు ఓటు వేయకపోయినా వారికి ఇవ్వాల్సిన గౌరవం ఇస్తూనే ఉన్నామని వ్యాఖ్యానించారు.


భూత వైద్యంచేయబడును



ఇళ్ళకు అష్టబంధన, అష్టదిగ్బంధన చేయబడును
అన్ని దోషములకు శాంతి చేసి ఎలాంటి గ్రహాలకైన
శక్తివంతమైన తావిత్తులు ఇవ్వబడును.
అరబ్బిక్ నజర్ బంద్ తావిత్తులు ఇవ్వబడును.
అడ్రస్ : పఠాన్ హుస్సేన్ ఖాన్ (ఆమిలే కామిల్)
రాయపూడి (పోస్ట్), తుళ్ళూరు (మండలం), గుంటూరు (జిల్లా)
ఫోన్ నెం. 93473 75766



శ్రీ కల్కి అందరివారు
ఎం.బేగ్
విశ్వశాంతి ధర్మ స్థాపకులు,దైవ సత్యస్వరూపి,
లోక రక్షకులు జగద్గురువులు శ్రీ కల్కి
కలియుగ కాల ప్రమాణము 4,32000 సంవత్సరాలు
3658 వ సం॥క్రీ॥ శ॥ 570 సం॥లో వచ్చారు. శ్రీ కల్కి
అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారు
కలియుగము మహా మంత్రమునకు సామ వేదములో
హా హా 1 లా ఇలాహ
హూ హూ 2 ఇల్లల్లాహు
హీ హీ 3 మొహమ్మదుర్ రసూలుల్లాహి
8143307812
ఎవరూ నరకానికి పోకుండా స్వర్గానికి వెళ్లాలనే ఆకాంక్షిస్తూ.

అతి త్వరలో దినపత్రికగా రానున్న
రాజధాని వార్తలు
పత్రికకు రాష్ట్రవ్యాప్తంగా
విలేకరులు కావలెను
సంప్రదించవలసిన నెం:9440662699
Email : Info@rajadhanivartalu.com

సమ్మర్ కోచింగ్
రాజధాని వార్తలు
రాయపూడి, పరిసర ప్రాంతగ్రామస్తులకు శుభవార్త
10వ, తరగతి ఆపై చదివిన విద్యార్థులకు
అతి తక్కువ ఖర్చుతో MS office, DTP ఇంగ్లీషు, తెలుగు నేర్పబడును.
వివరాల కోసం
94406 62699

రాజధాని వార్తలు ప్రకటనలు
గృహాము * ప్లాట్లు * మిషనరీ * వివాహాలు * కొనుగోళ్ళు * అమ్మకాలు * విద్య * ఉద్యోగం * ఉపాధి
నూతన, పాత వాహనములు, భవనములు కొనుగోలు చేయాలన్నా, విక్రయించాలన్నా, ప్రకటనలు ఇచ్చి ఎక్కువ ప్రయోజనాన్ని పొందండి
రాజధాని అమరావతి ప్రాంతం
94406 62699,96768 44442, ఇ-మెయిల్ : info@rajadhanivartalu.com
గమనిక
ప్రకటనదారు చెప్పుతున్న లేదా చేసుకున్న ఒప్పందములతో రాజధాని వార్తలు పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు.


Printed by Pattan Hussain Khan, published by Pattan Hussain Khan on behalf of Vastitude media pvt ltd.and printed at Jagathi Publications Ltd.
D.No: 5-625,Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. publised at Guntur. Editor: Pattan Hussain Khan,
Ph: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18